

# మెహెర్‌బాబా

అవతార్ మెహెర్‌బాబాకే అంకితమైన మాసపత్రిక

సంపుటి :20 సంచిక: 9 హైదరాబాద్ 2021 ఫిబ్రవరి పేజీలు 40

Please visit : www.srimeherbaba.com వార్షిక సభ్యత్వం : రూ.100/-

# హైదరాబాద్ నుండి మెహెరాబాద్

మెహెరాబాద్‌కు సొంత కార్లు, ఇతర వాహనాలలో వెళ్లదల్చినవారికి హైదరాబాద్ నుండి మూడు ప్రధాన మార్గాలున్నాయి. ఆ వివరాలు ఇలా వున్నాయి. పరిశీలించగలరు.

## ROUTE 1:

Hyderabad(Koti)-Patancheru-Sangareddy X roads (54KM)-Zaheerabad(95KM)-Humnabad(160KM)-Umarga(219KM)-Naldurg(260KM)-Tuljapur(291KM)-Osmanabad(319KM)-Yedashi-Yermala-Bhoom(379KM)-Jhamkhed(431km)-Ahmadnagar(508KM)-Meherabad(515KM).

## ROUTE 2:

Hyderabad(Koti)-Patancheru-Sangareddy X roads (54KM)-Zaheerabad, Humnabad, Umarga, Naldurg, Sholapur(302KM)-Tembhurni(390KM)-Jeur(416KM)-Karmala(455KM)-Miraj Goan-Arangoan(550KM)-Meherabad(552KM).

## ROUTE 3:

**అలాగే, షోలాపూర్ నుండి వయా డోండ్ మెహెరాబాద్‌కు చేరుకోవడం ఉభయకుశలోపరి అని ఇటీవల ఈ మార్గాన ప్రయాణించిన ప్రేమికులు తెలియజేస్తున్నారు.**

# మెహెర్ సుధాకర్ యూట్యూబ్ ఛానల్

ఆన్‌లైన్‌లో బాబా సహవాస్ నిర్వహించాలనుకునే బాబా కేంద్రాలకు తగిన సాంకేతిక సహాయం ఉచితంగా అందిస్తానని శ్రీ మెహెర్ సుధాకర్ ఒక ప్రకటనలో తెలియజేశారు. కోవిడ్ ప్రభావంలో తెలుగునాట గల పలు బాబా కేంద్రాల తరపున 2020 మార్చి నుండి రమారమిన 60కి పైగా ఆన్‌లైన్ సహవాస్‌లు నిర్వహించినట్లు శ్రీ సుధాకర్ (**90308 33930**) తెలిపారు. తమ ఛానల్‌ను నేటి వరకూ సుమారు 26 లక్షల, 19 వేల 535 మంది వీక్షించారని, 5 వేల మంది పైగా సభ్యులున్నారని ఆయన అన్నారు. మరికొంతకాలం కరోనా కట్టడి నియమాలు పాటించవల్సివున్నందున, తెలుగునాటగల బాబా కేంద్రాల నిర్వాహకులు వర్చ్యువల్ సహవాస్‌ల నిర్వహణ ద్వారా బాబా సత్సంగ్‌లు ఏర్పాటు చేసుకోవల్సిందిగా ఆయన కోరారు.

# బాబా సందేశం

**I shall attend to your needs, but not your wants**

**నేను తీర్చేది నీ అవసరాలే కాని, నీ కోర్కెలు కాదు.**

**–మెహెర్‌బాబా**


**గౌరవ సంపాదకులు**

**మల్లాది కృష్ణానంద్**

**99595-53218,**

**malladisukku@gmail.com**


## మనవి

**మీ వ్యాసాలు, ఇతర సమాచారం మాకు ప్రతినెల 10వ తేది లోపల పంపవలసింది. పత్రికను ప్రతినెలా 26న పోస్టు చేస్తున్నాం. 28వ తేదీలోగా పత్రిక మీ ముంగిట ఉంటుంది.**


**ఉత్తర ప్రత్యుత్తరాలకు**

ఎడిటర్,
మెహెర్‌బాబా,
గోదావరి గార్డెన్స్, యాప్రాల్,
ప్లాట్ నెం. 32,
జె.జె. నగర్‌కాలనీ ,
సికింద్రాబాద్-500 087
ఫోన్: 99595-53218


## లోపలి పేజీలలో...


| | |
|---|---|
| 1. సంపాదకీయం | 5 |
| 2. అణువంతే పుడతాడు | 6-8 |
| 3. మహా పుణ్య క్షేత్రము | 9 |
| 4. 52వ అమరతిథి విశేషాలు | 10-15 |
| 5. ఏకాంతవాసం | 16-17 |
| 6. పెండు - అస్పెండియర్ | 18-19 |
| 7. లార్డ్ మెహెర్ | 20-26 |
| 8. అంతరంగము | 28-29 |
| 9. మెహెరాబాద్ సహవాస్ | 30-32 |
| 10. కరుణామయుడు | 33-38 |
| 11. జీవిత సభ్యత్వం | 40 |


## ముఖ చిత్రం

**శ్రీమతి దయానా లీపేజి, ఆస్ట్రేలియా గీచిన అవతారుని తైలవర్ణ చిత్రం.**

## మనవి

**ఈ ప్రచురణలోని రచనలు, అందలి భావాలు సంబంధిత రచయితలవేనని పాఠకులు గమనించగలరు.**

Please visit : www.srimeherbaba.com

# మెహెర్‌బాబా పత్రిక

మెహెర్‌బాబా నామాన్ని ఎక్కువమంది పాఠకులకు అందజేసేందుకు వీలుగా మీ బంధు మిత్రులలో కనీసం ఒకరిద్దరినైనా ప్రోత్సహించి పత్రికకు వార్షిక, జీవిత సభ్యులుగా చేర్పించండి. మీ ఇ-మెయిల్ అడ్రస్ పంపితే పత్రికను ఇంటర్‌నెట్‌లో పంపగలం. పత్రిక పది వేల సైన్యంతో సమానమని గమనించగలరు. మరిన్ని వివరాలను ప్రతి సంచికలోని పేజి 40 లోగా సవివరంగా తెలియజేయడమైంది లేదా మొబైల్ 99595-53218 సంప్రదించగలరు. మెహెర్‌బాబా పత్రికను ప్రతినెలా ఠంచనుగా 26వ తేదీన పోస్ట్ చేస్తున్నాం. అంతకంటే ముందుగా అంటే ప్రతినెలా 20వ తేదీ కల్లా పత్రికను సిద్ధం చేసి ప్రింటింగ్ కోసం పంపుతూ, మెహెర్‌బాబా పత్రిక పేరిట ప్రారంభించిన వాట్సప్ గ్రూప్‌లో, అలాగే ఇ-మెయిల్ ద్వారా పోస్ట్ చేస్తున్నాం. ప్రింటింగ్ పూర్తయ్యాక సభ్యులందరికి ప్రతినెలా 26 తేదీన పోస్టు చేస్తున్నాం. పత్రిక మీ ఇంటికి 28వ తేదీలోగా తప్పక బట్వాడా అవుతుంది. మీ అడ్రస్సులో మార్పులుంటే తక్షణం మొబైల్ ఫోన్ నంబరు 99595 53218 యస్‌యంయస్ లేదా వాట్సప్ ద్వారా గానీ తెలియజేయవల్సింది.

### మంచి అవకాశం

మీ ప్రాంతాల్లో వున్న స్థానిక గ్రంధాలయ సంస్థలకు, స్వచ్ఛంద సంస్థలు, రెసిడెన్షియల్ స్కూళ్ళు, ఆధ్యాత్మిక సంస్థలు, మెహెర్‌బాబా పత్రిక సభ్యత్వం తీసుకోవడానికి తగినంత ఆర్థికస్తోమత లేనివారు ఎవరైనా వుంటే అలాంటి వారి జాబితాలో అర్హత గల కొందరికి మెహెర్‌బాబా పత్రికను ఉచితంగా అందజేయాలని ప్రతిపాదించడమైనది మెహెర్‌బాబా నామవ్యాప్తిలో భాగంగా, మెహెర్ సాహిత్యం పలువురికి అందజేయాలన్నదే ఈ ప్రతిపాదనలోని ప్రధాన ఉద్దేశ్యం. దయచేసి ఈ విషయమై స్థానిక బాబా ప్రేమికులు దృష్టి సారించి తగిన వివరాలను, వాట్సప్ నంబరు 99595 53218 త్వరలో పంపగలరు.

## శ్రీ గౌరు గృహప్రవేశం

విశాఖకు చెందిన బాబా ప్రేమికులు శ్రీ గౌరు మోహనరావు దంపతులు మెహెరాబాద్‌లో 2021 ఫిబ్రవరి 5న వారు కొత్తగా నిర్మించుకున్న మెహెర్ నివాస్‌లోనికి గృహప్రవేశం చేసినట్లు స్థానిక బాబా ప్రేమికులు తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సత్సంగ్ కార్యక్రమంలో ట్రస్టు చైర్మన్ శ్రీ శ్రీధర్ కేల్కర్, బాబా ప్రేమికులు శ్రీ జాల్ భాయ్, శ్రీ రమేష్ జంగ్లీ, తదితరులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. కాగా, కార్యక్రమాన్ని శ్రీ ప్రసాద్‌రాజు తనదైన శైలిలో నిర్వహించారు.

# సంపాదకీయం ...was delivered to the world

పూణేలోని ససూన్ జనరల్ ఆసుపత్రి శతజయంతి ఉత్సవాలను 1968 డిశెంబరు 1న ఘనంగా ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రి యాజమాన్యం మెహెర్‌బాబా సందేశం ఇప్పించమని కోరారు. **బాబా ఇచ్చిన సందేశం ఇలా వుంది.**

**I, the Deliverer of the world, was delivered to the world.**

1894 ఫిబ్రవరి 25న తెల్లవారుఝామున 5 గంటలకు పూణేలోని ససూన్ జనరల్ ఆసుపత్రిలో బాబా జన్మించారన్న సంగతి పాఠకులకు తెలుసు. ఈ సందర్భంగా బాబా ఆసుపత్రికి వెయ్యి రూపాయలు విరాళంగా పంపారు. ఆ దరిమిలా 1968 డిశెంబరు 9న, ఆసుపత్రి వర్గాలు అవతారుని ఎడల గౌరవ సూచకంగా శిలాఫలకం నొకదాన్ని ఇలా ఏర్పాటు చేశారు.

**AVATAR MEHER BABA WAS BORN IN SASSOON GENERAL HOSPITAL ON 25TH FEBRUARY 1894.**

1969 జనవరి 31న బాబా తన భౌతికదేహం వదిలిపెట్టాక, ఆయన్ని మెహెరాబాద్‌లో ముందుగానే నిర్మించిన సమాధిలో బాబా ప్రేమికుల దర్శనార్థం ఏడు రోజులపాటు, ఫిబ్రవరి 7 దాకా వుంచారు. అనంతరం సమాధి చేశారు. బాబాని సమాధి చేసిన రోజు, జొరాస్టర్ క్యాలెండర్ ప్రకారం బాబా జన్మదినోత్సవం కూడా అయ్యింది. అమరతిథి రోజుననే పుట్టినరోజు కావడం కాకతాళీయం ఏమాత్రం కాదు. జనన మరణాలకు తాను అతీతుడనన్నారు మెహెర్‌బాబా. 44 సంవత్సరాలు కఠిన మౌనం పాటించిన బాబా, తెల్లవారితే శరీరం వదిలిపెడ్తారనగా, ముందురోజు రాత్రి, తాను "ఈ దేహం కాదు. గుర్తుంచుకోండి" అని స్పష్టమైన స్వరంతో చెప్పారు. ప్రతిఏటా బాబా ప్రేమికులు ఫిబ్రవరి 25న బాబావారి జన్మదినోత్సవాన్ని పెద్దఎత్తున జరుపుతారు. కాగా, బాబావారి 75వ జన్మదినోత్సవ సందర్భంగా బాబా తన సందేశాన్ని 1968 డిశెంబరు 11న, తన కార్యదర్శి ఆది.కె.ఇరానీకి ముందుగానే డిక్టేట్ చేశారు. ఐతే, ఈ సందేశాన్ని 1969 జనవరి నెల ముగిసే వరకూ ప్రకటించవద్దని బాబా హెచ్చరించారు. అవతారునికి అన్నీ అవగతమే! ఇది బాబావారి ఆఖరి జన్మదిన సందేశం. బాబావారిఈ సందేశం నేటి తరానికి నిత్యస్మరణీయం కావాలి!!

***

"To love me for what I may give you is not loving me at all. To sacrifice anything in my cause to gain something for yourself is like a blind man sacrificing his eyes for sight. I am the divine beloved, worthy of being loved because I am love. He who loves me because of this will be blessed with unlimited sight and will see me as I am." Meher Baba.

## అవతారుని జన్మదినోత్సవాలు

# అవతారుడైనా అణువంతే పుడతాడు



**అవతారమూర్తి యైనా -**
**అణువంతే పుడతాడు**
**అమ్మ పేగు పంచుకునే -**
**అంతవాడు అవుతాడు**
**అమ్మేగా చిరునామా -**
**ఇంతటి ఘన చరితకి**
**అమ్మేగా కనగలదు -**
**అంత గొప్ప అమ్మని**

***

**ఒక గొప్ప సినీ కవి అన్న మాటలివి.. భగవంతుడు నాలుగు అవతారాలు తీసుకున్న తర్వాత ఆయనికి తానేదో కోల్పోతున్నానని అనిపించిందట. ఏం కోల్పోతున్నానని ఆయన ఆలోచించుకుంటే, అరే!! నేను నాలుగు అవతారాలలో అమ్మ లేకుండానే వచ్చేశాను. మిగిలిన అవతారాలలో అమ్మ కడుపులో పుట్టి అమ్మతనం ఏమిటో తెలుసు కోవాలనుకున్నాడట దేవుడు. మరి ఈ మాటలకు ఆధారాలు చూపలేం. కానీ, నిశితంగా ఆలోచిస్తే ఇవి అక్షరసత్యాలనిపిస్తుంది.**

***

మెహెర్‌బాబా పూణేలోని ససూన్ అసుపత్రిలో 1894 ఫిబ్రవరి 25న షిరీన్‌మాయి, షిరియార్జీ జొరాస్ట్రియన్ దంపతులకు రెండవ సంతానంగా జన్మించారు. 1969 జనవరి 31న బాబా తన భౌతికదేహం త్యాగం చేశారు. అనంతరం, ఆయన్ని ఏడు రోజులపాటు, అంటే, ఫిబ్రవరి 7 దాకా , అహ్మద్‌నగర్ జిల్లా కేంద్రం నుండి ఐదు కిలో మీటర్ల దూరంలో వున్న మెహెరాబాద్‌లో ముందుగానే నిర్మించిన సమాధిలో బాబా ప్రేమికుల దర్శనార్థం వుంచారు. ఏడవ రోజున, అంటే, ఫిబ్రవరి 7న సమాధి చేశారు. జొరాస్ట్రియన్ క్యాలెండర్ ప్రకారం ఫిబ్రవరి 7న అవతార్ మెహెర్‌బాబా జన్మదినోత్సవం అయ్యింది. పుట్టినరోజునాడే అవతారుని అమరతిథి కూడా అయింది. ఇదే అవతారుని విశిష్టత. జనన మరణాలకు తాను అతీతుడనన్నారు మెహెర్‌బాబా.

# షిరీన్‌మాయి బాబాలో ఐక్యం

## 1943 ఫిబ్రవరి 25.

మెహెర్‌బాబా తల్లి షిరీన్‌మాయి అవతారుని జన్మదినమైన ఫిబ్రవరి 25న తుదిశ్వాస వదిలింది. అవతారునిలో ఐక్యమయిన ధన్యురాలు. ఇది యాదృచ్ఛికం కాదని బాబా ప్రేమికుల నమ్మకం. షిరీన్‌మాయి ఆఖరి ఘడియలు గురించి తెలియజేసే అరుదైన సమాచారం మెహెర్‌బాబా పాఠకుల కోసం ప్రత్యేకంగా అందజేస్తున్నాం. దయచేసి పరిశీలించండి.

## 1943 ఫిబ్రవరి

స్వాతంత్ర్య పోరాటం జరుగుతున్న రోజులవి. 1943 ఫిబ్రవరి. యావత్తు దేశంలో యుద్ధవాతావరణం నెలకొని వుంది. మన దేశంలో మొక్కజొన్న, గోధుమల సరఫరాపై కూడా ఆంక్షలు విధిస్తున్నట్లు ఆనాటి బ్రిటీషు ప్రభుత్వం ప్రకటించింది. ఇది తెలుసుకున్న షిరీన్‌మాయి, ఏమిటీ పరిస్థితి. తినేతిండి కూడా కావల్సినంత దొరకని రోజులు వస్తున్నాయా? అంటూ, ఇలాంటి పరిస్థితి మరింత విషమించక ముందే, తన తనవు చాలిస్తే బాగుంటుందని తన దగ్గరున్న వాళ్ళతో అన్నది. కొద్దిరోజుల తర్వాత రెండు జాకెట్లు కుట్టించుకోవడానికై టైలర్‌ని పిలిచి, అందుకు తగిన రవిక గుడ్డలు ఇస్తూ, "తీరా నీవు కుట్టి తెచ్చాక నేను ఈ భూమీమ్మీద ఉంటానో ఉండనోనని అన్నది". అంతక్రితమే ఓ రోజున తన తుదిరోజులు దగ్గరపడినట్లు కలగన్నానని తన దగ్గర వారితో ఆమె చెప్పింది. ఫిబ్రవరి 21న ఆవిడ ఆరోగ్యం బాగోలేదు. బ్రెయిన్ హెమరేజ్ అయ్యింది. స్థానిక ఆసుపత్రిలో చేర్పించారు. ఆమె పరిస్థితి విషమంగా వుంది. డాక్టర్లు ఆమెని ఇంటికి తీసుకెళ్ళడమే మంచిదని సూచించారు. ఆ సమయంలో బాబా మహాబళేశ్వర్‌లో వున్నారు. బాబా సోదరులు ముగ్గురూ ఆమె దగ్గరే వున్నారు. ఇదిఇలా వుంటే, అన్నీ ఎరిగిన అవతారుడు, ఫిబ్రవరి 23న తన తల్లి ఆరోగ్యం బాగాలేదు. మండలి సభ్యుడైన ఛాంజీని తక్షణం పూణే వెళ్ళమన్నారు. తన తల్లి తుదిశ్వాస వదిలే అవకాశం కూడా వుందన్నారు. పూణే, ముంబాయి, అహ్మద్‌నగర్‌లలో వున్న బంంధువులందరికి ఈ విషయం తెలియజేయమన్నారు. ఫిబ్రవరి 25, గురువారం నాడు ఆమెను ఆసుపత్రి నుండి ఇంటికి తీసుకువచ్చారు. ఆమె అపస్మారకస్థితిలోనే వుంది. ముఖంపై చిరునవ్వు చెదిరిపోలేదు. కాగా, ఆ రోజు రాత్రి 9.40 నిముషాల సమయంలో షిరీన్‌మాయి అవతారుని అనంత ప్రేమ మహాసముద్రంలో లీనమయిందని ప్రకటించారు. అప్పటికి ఆమె వయస్సు 65 సంవత్సరాలు.

మహాబళేశ్వర్‌లో వున్న బాబాకు టెలిగ్రాం ఇచ్చారు. ఆయన వెంటనే ఏరుచ్‌తో కలిసి పూణేకి బయలుదేరారు. బాబా పూణే చేరుకునేసరికి అర్ధరాత్రి అయింది. అలావచ్చిన బాబా తన తల్లిని కడసారిగా చూడ్డానికి వారింటి లోపలికి వెళ్ళలేదు. వారింటికి దగ్గర్లోనే కొద్దిసేపు నిల్చుని, ఆ పిదప ఆ రాత్రికి పూణేలోనే వున్న ఏరుచ్ తల్లితండ్రుల ఇల్లు – బింద్రా హౌస్‌కు వెళ్ళారు. ఆ మర్నాడు టవర్ ఆఫ్ సైలెన్స్‌లో సాంప్రదాయకంగా ఆమె అంత్యక్రియలు జరిగాయి. బింద్రా హౌస్‌లో ఏరుచ్ తల్లి గైమాయితో మాట్లాడుతూ "నేను రాకముందే నా తల్లి మరణించడం మంచిదయ్యింది. నేను కనుక ఆమె దగ్గరగా వున్నట్లయితే, ఆమెను చనిపోయినిచ్చేవాడిని కాదు, ఆ దరిమిలా ఆమె భౌతికంగా మరిన్ని కష్టాలను అనుభవించవల్సివచ్చేదని" అన్నారు. ఆమె తనలో ఐక్యమైందన్నారు బాబా. ఆమె ఈ భవబంధాల నుండి విముక్తి పొందిన ధన్యురాలన్నారు. ఆ పిదప బాబా ఏరుచ్‌తో కలిసి తిరిగి మహాబళేశ్వర్ వెళ్ళిపోయారు. రెండ్రోజుల తర్వాత ఫిబ్రవరి 27న తిరిగి పూణేకి వచ్చి బింద్రా హౌస్‌లోనే వున్నారు. ఈ దఫా బాబా వారింటికి వెళ్ళారు. బాబా సోదరులు జాల్, బెహ్రాం, ఆదీ, వారి కుటుంబసభ్యులను కలుసుకున్నారు. వారి పిల్లలతో కొద్దిసేపు ఆడుకున్నారు. అనంతరం బాబా తన సోదరులతో మాట్లాడుతూ, తమ తల్లి తనను చేరిందని, అనంత ఆనందమయ స్థితిలో వుందని అన్నారు. నా ఆధ్యాత్మిక కార్యక్రమంలో ఆమె ఎంతగానో సహాయపడిందన్నారు. తన పాత్ర పూర్తవగానే నన్ను చేరుకుందన్నారు. ఆమె ఎంతో ధైర్యం గల వ్యక్తి. మీరు ముగ్గురూ నాతో పశ్చిమ దేశ పర్యటనలో వున్న సమయంలో తండ్రి షెరియార్జీ పూణేలో మరణించారని, ఆ సమయంలో తన తల్లి ఒక్కతే పూణేలో ఒంటరిగా ఆ విషాద సంఘటనను ఎదుర్కొందన్నారు. ఆమె అంతటి ధైర్యసంపన్నురాలు కాబట్టే, మిమ్మల్ని ముగ్గురినీ తనతో తీసుకెళ్ళ గల్గానన్నారు. ప్రస్తుతం ఆమెకు ప్రాపంచికంగా ఎలాంటి బంధనాలు లేవు. ఆమె చాలా ఆనందంగా వుందన్నారు. తన తల్లి కోరిక మేరకు వారి ఆస్తిని ముగ్గురు సోదరులకు పంచిపెట్టి, ఆ రాత్రికి బాబా బింద్రా హౌసుకు తిరిగి వెళ్ళిపోయారు. అనంతరం మెహెరాబాద్‌లో బాబా సమాధి ప్రక్కనే తల్లితండ్రులిద్దరి కోసం సమాధిని నిర్మించారు. 1943 జూన్ నాటికి సిద్ధమైన ఆ సమాధిపై బాబా ఇలా రాయించారు.

"In eternal memory of Meher Baba's blessed parents,
Sheriarji and Shireenmai, who are now merged in Baba's infinity."

***

తన తల్లితండ్రులకు చెందిన కళ్ళజోడు, దుస్తులను వారి జ్ఞాపకార్థం ఈ కట్టడంలో అవతారుడు స్వయంగా నిక్షిప్తం చేశాడు. ఈ దఫా మెహెరాబాద్ వెళ్ళినప్పుడు ఈ సమాధిని కూడా సందర్శించగలరు.

***

# మెహెరాబాద్-మహా పుణ్య క్షేత్రము

**(అన్నమాచార్య కీర్తన-అన్ని మంత్రములు యిందే... అను పాట వరస)**

**రచన- శ్రీ సి.వై. చింతామణి, విజయనగరం**

ప॥ మెహెరాదే మనకు పుణ్యక్షేత్రము
మెహెర్ నామమే మనకు మహా మంత్రము ॥మెహెరా॥

1. దివ్య సన్నిధానము నొసగే పరమ ధామము
దివ్య ప్రేమ సుధలను చిందే దివ్యక్షేత్రము
అవతారుని పదసవ్వడులతో అలరించే వాసము
ఆనందము అవధులు దాటి పల్లవించు క్షేత్రము ॥మెహెరా॥

2. మానవాళి మనుగడ కిదియే ప్రేమాలయము
మౌనములో ప్రతిధ్వనించు ప్రణవనాదము
దైవసన్నిధానమిదియే సకల జనుల గమ్యము
సాధకులకు సేద దీర్చెడి స్వర్గధామము ॥మెహెరా॥

3. ఏకేశ్వరుడిటనే సలిపెను ఏకాంతవాసములు
లోకేస్వరుడిటచే సలిపెను ఉపవాసములు
దివ్య ప్రేమ పంచగ జరిపెను సహవాసములు
అవతారుని ప్రేమ కిదియే ఆలవాలము ॥మెహెరా॥

# మెహెర్‌బాబా పత్రిక కోసం

**శ్రీమతి బి. బాలసరస్వతి దేవి, విజయవాడ మెహెర్‌బాబా పత్రిక నిర్వహణ ఖర్చుల కోసం 2021 ఫిబ్రవరిలో రూ 3,000/- విరాళంగా పంపారు. అలాగే, హైదరాబాద్‌లో మరో బాబా ప్రేమికుడు, తమ పేరు ప్రకటించవద్దన్నారు. ఆయన రూ. 10,000/- విరాళంగా పంపారు. వీరిద్దరికీ పత్రిక పక్షాన ధన్యవాదములు. జైబాబా.**

# మహా పుణ్యక్షేత్ర దర్శనం

## 52వ అమరతిథి విశేషాలు

**మల్లాది రామారావు, మెహెరాబాద్**



అద్భుతాలు చేయనంటూనే అద్భుతాలు చేస్తారు మెహెరీశుడని ప్రేమికుల నమ్మకం. ఆ నమ్మకం సబబు అయినదే అనిపించింది ఈ ఏడాది అమరతిథి చూస్తే. సుమారు 10 నెలలకి పైగా కరోనా రక్కసి భయంతో వణికి పోయింది మెహెరాబాద్. పిలిస్తే పలుకుతానన్న మెహెరీశుని సమాధి దర్శనం దూరమయింది ప్రేమికులకి. సమాధి తలుపుల దగ్గర కాసేపు నిలబడే సదావకాశం మాత్రం దొరికింది, అదీ కొత్త సంవత్సరానికి రంగం సిద్దమవుతుంటే. మరి యిటువంటి పరిస్థితుల్లో అమరతిథి వేడుకలపై తెరపడక తప్పదనిపించింది అందరికీ. సరిగ్గా ఆ సమయంలో యుగావతారుడి చమత్కారం చటుక్కున మెరిసింది. నీ సన్నిధి మాకు పెన్నిధి అని భావించే ప్రేమికలోకంలో కొత్త ఆశ చిగురించింది. చిటికెలో ప్రపంచాన్ని కలిపే అంతర్జాలం ఆసరా అయింది. ఇంటర్నెట్ యుగం నవశకానికి నాంది అవుతుందని వూహించని పాతతరం, 'ఆహా! ఏమి అద్భుతం' అని ఆశ్చర్యంలోపడ్డారు. మెహెరీయంలో తలపండిన పెద్దలకి అంతర్జాలంలో కొత్తదనం కనబడలేదు. ఈ వింత గురించి బాబావారు ఎప్పుడో జోస్యం చెప్పారు కదా మరి. ఫలితంగా మెహెరాబాద్‌కి దూరమయిన ఎందరో కవులు, గాయకులు, సంగీత విద్వాంసులు, నృత్య కళాకారులు, నటులు, తమ యింటి దగ్గర నుంచే తమ విద్వత్తును ప్రదర్శించారు. మెహెర్ గుణగానం చేశారు. చైనా, రష్యా, ఇరాన్, కొరియా, బర్మా, ఆస్ట్రేలియా, అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్, స్పెయిన్, ఇజ్రాయిల్, అర్జెంటినా, గల్ఫ్ దేశాల నుంచి మెహెర్ ప్రేమికులు ఇంటర్నెట్ ద్వారా మెహెరుని సన్నిధికి చేరారు. ఇహ మనదేశం నలుమూలల నుంచీ ప్రేమికులు తమ అంజలి ఘటించారు. ఈసారి అమరతిథికి విలక్షణత తెచ్చారు. ప్రతిసారీ తమకి సరైన టైం కేటాయించలేదని, మా కార్యక్రమాన్ని పూర్తి చేయనీయలేదని గుర్రు మనేవారు చాలామంది. కానీ, ఈసారి కిర్రుబుర్రుమనే వారే కనబడలేదు ట్రస్ట్ వారు పెట్టిన గడువుకి అందిన అన్ని కార్యక్రమాలనీ అంతర్జాలంలో చూపించారు.

కొంతమందయితే సకాలానికి తమ కార్యక్రమాన్ని పంపలేకపోయినా, కదంబంలో పాల్గొన్నారు. ఇది ఎలాగ సాధ్యమయిందంటే, స్థానిక కళాకారుల ప్రోగ్రామ్‌ని రికార్డు చేస్తున్న వేళకి మెహెరాబాద్ రావటం వల్ల, సరే మీరూ కానీయండి అన్నారు నిర్వాహకులు. రికార్డింగ్ చేస్తున్న ఏ-హాస్టల్ నుండి పిలుపు లభించింది ఈ అదృష్టవంతులకి. “పిలిచితే పలుకుతావట”, మెహెర్‌బాబా అంటూ తమ అంజలి ఘటించారు వారు. 52వ అమరతిథి కార్యక్రమం 30వ తేదీ మధ్యాహ్నం నుంచి నిరాఘాటంగా ప్రసారం చేశారు. వచ్చే ఏడాది నుంచి వర్చ్యువల్ ప్రోగ్రామ్ పెడితే బాగుంటుందేమో? ఈ ప్రశ్నకి ట్రస్టు ఛైర్మన్ శ్రీధర్ కేల్కర్ ఆచితూచి స్పందించారు. “బాగుంది ఈ ఐడియా!! చూద్దాం అంతా బాబా యిచ్ఛ”, అన్నారు. ప్రతి ఏడాదీ ఆగస్టు నుంచి మొదలవుతాయి అమరతిథి ఏర్పాట్లు. కానీ కరోనా పేరు చెప్పి పాత పద్ధతులకి స్వస్తి చెప్పాల్సి వచ్చింది. ఆగస్టునాటికి పరిస్థితుల్లో, అమరతిథి నిర్వహణ కష్టమనిపించింది కూడా. కానీ డిశెంబరు నాటికి పరిస్థితి మెరుగయింది. కానీ కరోనా పూర్తిస్థాయిలో కట్టడి కాలేదు. కాబట్టి బాబావారి దర్శనాన్ని సమాధి ముంగిటకి పరిమితం చేసినా, ఎప్పటిలా ప్రేమికలోకం తరలివస్తే, తట్టుకోవడం కష్టమనిపించింది. ఈ పరిస్థితుల్లో విచ్చేసే ప్రేమికులందరికీ భోజన, బస ఏర్పాట్లు చేయడం క్షేమకరం కాదని స్థానిక బాబా ట్రస్టు ఒక నిర్ణయానికి వచ్చింది. ఐనప్పటికీ చాలామంది ప్రేమికులు అహమ్మద్‌నగర్‌లో హొటళ్ళు, గెస్ట్‌హౌస్‌లు తమ వీలుని బట్టి ముందుగా రిజర్వు చేసుకుని జనవరి 30కల్లా మెహెరాబాద్ బాబా దర్శనార్థం వచ్చారు. మరికొందరు జనవరి 31న ఉదయానికల్లా బస్సుల్లో, కార్లలలో మెహెరాబాద్‌కు చేరుకున్నారు. మెహెరాబాద్‌లో వుంటున్న శ్రీ ప్రసాద్ రాజు జనవరి 31న బాబా ప్రసాదంగా విచ్చేసిన పలువురికి భోజనాలు ఏర్పాటు చేశారు.జనవరి 31న ఉదయం తొమ్మిదిన్నర, పది గంటల వరకు పెద్దగా ప్రేమిక జనసందోహంలో క్యూ లైన్లు లేవనే చెప్పాలి. స్థానికులు కొందరు వొకటికి రెండుసార్లు దర్శనం చేసుకొన్నారా సమయంలో. కానీ మధ్యాహ్నం 12 గంటలు మౌన సమయం దగ్గరవుతుంటే, క్యూలో ప్రేమికుల సంఖ్య భారీగా పెరిగింది. కొండ కాలిబాట నిండి పోయింది ప్రేమికులతో. సమాధిలోకి అడుగుపెట్టే అదృష్టం నోచుకోలేక పోతున్నామనే దిగులు మనస్సులో వున్నా ప్రభువు నడిచిన కాలిబాటన దర్శనం కోసం వెడుతున్నామన్న తృప్తి కనిపించింది అందరిలో. సర్వాంతర్యామి అనంత మౌనంలో భాగమయ్యే పదిహేను నిమిషాలప్పుడు కొండపైన ఎటుచూసినా గుంపులు గుంపులుగా కనిపించారు మెహెర్ ప్రేమికులు. ఎండ చుర్రుమనిపిస్తున్నా లెక్కచేయలేదు సరికదా, మౌన ఘడియల వరకూ నామసంకీర్తన చేస్తూ కనిపించారు. అయితే 15 నిమషాల మౌనానంతరం, అమరతిథి భక్తులు పలచబడ్డారు. మధ్యాహ్నం రెండు కొట్టేసరికి, అమరతిథి దర్శనం

చాలావరకూ పరిసమాప్తమయిందనవచ్చు. సుమారు నాలుగు వేలమంది తరలి వచ్చారీవాళ అన్నారొక స్థానిక మహాశయుడు. అంతమంది కాదు కానీ, రెండు వేల పైచిలుకు వచ్చినట్లున్నారన్నారు ట్రస్ట్ చైర్మన్ శ్రీధర్ కేల్కర్. అమరతిథి కార్యక్రమం సాఫీగా జరిగిందన్నారు. ప్రతిసారీలాగా ఈసారీ కూడా పోలీసులకు చెప్పాం, అమరతిథి గురించి బందోబస్తు చేస్తామన్నారు. అంతగా అక్కర్లేదన్నాము కానీ పోలీసుల బలంగం వచ్చి, కార్యక్రమం ఆఖరి వరకూ వున్నారన్నారు. టెర్రరిస్టుల ప్రమాదం మెహెరాబాద్‌కి కూడా పొంచి వుంది అంటూండటం వల్ల పోలీసు నిఘా బృందం తరుచు వస్తోంది. ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తోంది. ఈ తనిఖీ బృందంతో సుశిక్షుతులయిన జాగిలాలు కూడా వస్తున్నాయి. అవి ప్రభువుకి అంజలి ఘటించే పద్ధతి చూస్తుంటే, "ఔరా!" అనిపిస్తుంది. నిశ్శబ్దంగా వస్తాయి సమాధి ముంగిటకి. సాష్టాంగ నమస్కారం చేస్తాయి. ఎంత చడీచప్పుడు చేయకుండా వస్తాయో, అలానే నిశ్శబ్దంగా తోకాడిస్తూ నిష్క్రమిస్తాయి. సమాధికి వచ్చిన ప్రతిసారీ అంతే. గత కొద్ది నెలలుగా అవే ఆదర్శమయినాయి అందరికీ కరోనా పేరు చెప్పి. 'ఇంకా ఎంతకాలం ఈ నిరీక్షణ. ఈ ప్రశ్నకి జవాబు దొరికింది అమరతిథి అయిన తొమ్మిది రోజులకి. బాబా ప్రేమికులు అందరూ మాస్కులు ధరించి వస్తున్నారు. నిశ్శబ్దంగా క్రమశిక్షణతో దర్శనం చేసుకొంటున్నారు కాబట్టి ఉదయపు ప్రార్థనలకూ, ఆరతికీ అనుమతిస్తున్నట్లు శ్రీధర్ కేల్కర్ ప్రకటించారు. సాయంత్రపు ప్రార్థనలు, ఆరతిని యధాతథంగా నిర్వహిస్తామన్నారు. ఉదయం ఏడింటికి, సాయంత్రం ఏడింటికి గతంలో, అంటే కరోనా పూర్వపు రోజుల్లో మాదిరి ప్రార్థనలు నిర్వహించాలని నిర్ణయించారు. అప్పట్లో వో గంటసేపు భజన కార్యక్రమం వుండేది. ఇప్పుడు భజనలు వుండవు అంతే తేడా. అప్పటికీ ఇప్పటికి ఇలా ఎంతకాలం? "చూద్దాం! ఎంతకాలమో", అన్నారు శ్రీధర్. సమాధిలో అడుగుపెట్టే రోజు ప్రేమికలోకానికి ఎప్పుడు వస్తుందో? సమాధి శుచి చేసే పనిలో అందరూ పాల్గొనేవారు ఒకప్పుడు. ఆ మహద్భాగ్యం ప్రస్తుతానికి లేనట్లే. బాబా దర్శనం అయ్యాక ప్రసాద వితరణ ప్రస్తుతానికి లేదు. సమాధిని గుమ్మం బయట నుంచే చూడటం అలవాటవుతోంది ఇప్పుడిప్పుడే. భవిష్యత్‌లో సమాధి చుట్టూరా భవ్య దివ్య మందిరం కట్టినప్పుడు, దూరం నుంచే దర్శించుకోవల్సి వస్తుంది.

**బహుశా ఆ రోజుకి ఇప్పటి నుంచే తర్ఫీదు లభిస్తోందనుకోవాలి!!**

**మెహెర్‌బాబా పత్రిక ఆన్‌లైన్‌లో**

**www.srimeherbaba.com** సందర్శించండి!!

# మెహెరాబాద్‌లో అమరతిథి రోజున



**– శ్రీమతి రమ, మెహెరాబాద్ నుండి**

2020 డిశెంబరు నుండి వేం మెహెరాబాద్‌లోనే వుంటున్నాం. ప్రతిరోజూ బాబాను దర్శనం చేసుకుంటూ ఇక్కడ సేదతీరుతున్నాం. ఆ కారణంగా, జనవరి 30, 31 తేదీలలో అమరతిథి వేడుకలలో సమాధి ప్రాంగణంలో వాలంటీర్‌గా పనిచేసే అవకాశం నాకు లభించింది. బాబా సమాధి దర్శనం చేసుకున్నాక ప్రేమికులు తక్షణం ఆ ప్రాంగణం వదిలి వెళ్ళిపోవాలని ట్రస్టు ఆదేశించింది. సమాధి ప్రక్కనే వున్న బాబావారి గదిలోకి తొంగి చూడ్డానికి కూడా వీలు లేకుండా తాళ్ళతో కట్టడి చేశారు. సమాధి దర్శన ప్రాంగణంలో ప్రతిఒక్కరి నడుమ దూరం పాటించేలా ఏర్పాటు చేశారు. మాస్కులు, చేతులు శుభ్రపరచుకోవడం లాంటివి విధిగా అమలుపరిచారు. తెలుగువారికి భక్తిరసం ఎక్కువ కదా!! అమరతిథి రోజున తెలుగు ప్రాంతాల నుండి చాలామంది జనవరి 30న మెహెరాబాద్ చేరుకున్నారు. ఆ మర్నాడు మధ్యాహ్నం 12 – 12.15 నడుమ మౌనం పాటించి, ఎవరికివారు తమ స్వస్థలాలకు వెనుతిరిగారు. సమాధిలో అవతారుడ్ని దూరం నుండి దర్శించుకునే ఏర్పాటు చేశారు. ఆ వెనువెంటనే అక్కడ్నుంచి నిష్క్రమించాలని మేం వాలంటీర్లుగా ప్రేమికులనందర్నీ వినయంగా కోరాం. మెహెరాబాద్‌లోని స్థానిక బాబా ప్రేమికులు, ట్రస్టులో పనిచేసే ఉద్యోగులు, సుమారు 100 మంది వాలంటీర్లుగా ఆ రెండ్రోజులు పనిచేశారు. జనవరి 31, అమరతిథి రోజున మధ్యాహ్నం 12 నుండి 12.15 వరకూ బాబా దర్శనం నిలిపివేశారు. విచ్చేసిన ప్రేమికులందరూ బాబా నామస్మరణతో మౌనం పాటించారు. ఆ పిదప ప్రార్థనలు, ఆరతుల వంటి కార్యక్రమం ఏమీ నిర్వహించలేదు. పూలహారాలు, ప్రసాద వితరణ అసలు లేదు. మౌనం పాటించే సమయంలో సమాధి ప్రాంగణంలో కూర్చోవడానికి కుర్చీలు ఏర్పాటు లేకపోవడంలో విచ్చేసిన ప్రేమికులు అక్కడున్న కొద్దిపాటి చెట్ల నీడన, ఓపెన్ ఆడిటోరియంలో తలదాచుకున్నారు. కోవిడ్ వైరస్ పూర్తిగా సమసిపోలేదు. కాబట్టి ఇంకా జాగ్రత్తలు పాటించాల్సిందేనన్నది ట్రస్టువారి ఆలోచన. అమరతిథికి విచ్చేసిన ప్రేమికులకు వసతి సమకూర్చిన స్థానికులు, అద్దె రూపంలో పెద్దఎత్తున నగదు వసూలు చేశారు. "కోవిడ్ రేట్లు" వసూలు చేశారని ప్రేమికులు సర్దిచెప్పుకున్నారు. ఈ సమస్య త్వరలోనే సమసిపోతుందని ఆశిద్దాం. **అందాకా నిరంతర మెహెర్ మహామంత్ర జపంతో గడుపుదాం!!**

## అమరతిథి విశేషాలు

# ఆనాటి హడావిడి ?

**-శ్రీమతి భట్టిప్రోలు మెహెర్ పద్మ**



మెహెరాబాద్‌లో అమరతిథి వేడుకల్లో పాల్గొనేందుకు మా ఇద్దరు పిల్లలతో కలిసి నేను జనవరి 29న విజయవాడ నుండి బయల్దేరి ఆ మర్నాడు మధ్యాహ్ననికి మెహెరాబాద్ చేరుకున్నాం. ఆ పిదప బాబాని దర్శించుకున్నాం. ఈ కోవిడ్ పరిస్థితుల వల్ల బాబాని దర్శించుకుని చాలాకాలం కావడంతో, బాబాని దర్శించుకున్నాక నా మనస్సు తేలికయ్యింది. నాలో నేను తృప్తిగా సంతోషించాను. కానీ, నా మనస్సులో ఎక్కడో ఏదో వెలితి కొండంత వుందనిపించింది. నిరిడు వరకూ మెహెరాబాద్‌లో మనం చూసిన అమరతిథి హడావిడి ఎక్కడా కనిపించలేదు. రంగురంగుల చలువ పందిళ్ళు అసలే లేవు. ప్రేమిక జనసందోహం కూడా అంతంత మాత్రమే వుంది. అనేక ప్రాంతాల నుండి వచ్చిన బాబా ప్రేమికులతో సంతోషంగా పంచుకున్న ఆ అనుభూతి ఇప్పుడు లేదు. అన్నింటికంటే ముఖ్యంగా నా హృదయాన్ని బాగా గాయపరిచింది ఏమంటే, అమరితిథి రోజున బాబా సమాధిని స్పృశించే అవకాశమే లేకపోవడం. బాబా సమాధిపై కొన్ని క్షణాలు తల ఆనించి, మనస్సులో రగిలిపోతున్న ఆవేదన్ని ఆయనికి నివేదించుకుంటే, ఎంతో ఊరట పొందేవాళ్ళం. సమాధి దర్శనం చేసుకున్నాక చెమర్చిన కళ్ళతో బైటకు వస్తూంటే, మాటల్లో వర్ణించలేనంత ప్రశాంతత లభించేది. ఆ అనుభూతి రమారమిన ఏడాది వరకూ బద్రంగా వుండేది. ఐతే, ఆ అవకాశం ఎప్పుడు లభ్యమయ్యేనో కదా? అనిపించింది. అమరతిథి రోజున మెహెరాబాద్‌లో గతంలో మాదిరి భోజన, బస ఏర్పాట్లు లేవు. ఐనప్పటికీ చాలా ప్రాంతాల నుండి ప్రేమికులు జనవరి 30, 31 తేదీలలో మెహెరాబాద్ వచ్చారు. కొందరు జనవరి 31న వచ్చి అదే రోజు సాయంత్రానికి తమ స్వస్థలాలకు వెళ్ళిపోయారు. ఈ కోవిడ్ త్వరలో తొలగిపోయి, అవతారుని దివ్య సమాధిపై శిరస్సు వంచి ప్రణమిల్లే భాగ్యం త్వరలో ప్రసాదించమని ఆయన్ని కోరుకోవడం మినహా మానవ మాత్రులం, మనం ఏం చేయగలం? ఏం చెప్పగలం!! ఆ అవకాశం త్వరలో లభిస్తుందని ఆశిస్తూ,,,,,

## అమరతిథి విశేషాలు -3

# కరోనాలో అవతారుని కరుణ

**-శ్రీమతి తోయజాక్షి, పూరి, ఒడిస్సా**



గత ఏడాది అవతారుని అమరతిథికి మెహెరాబాద్ వెళ్ళాం. ఇక అంతే. కరోనా మహమ్మారి ప్రభావం వల్ల 2020 జూలై 10న మౌన వార్షికోత్సవానికి మెహెరాబాద్‌కి వెళ్ళలేకపోయాం. ఐతే, ఈ ఏడాది అవతారుని అమరతిథికి ఎట్టి పరిస్థితుల్లోనైనా హాజరవ్వాలని 2020 అక్టోబర్‌లోనే రానూ-పోనూ రైలు టిక్కెట్లు రిజర్వేషన్లు చేయించాం. ఈ సమయంలోనే మెహెరాబాద్‌కి ఎవరూ రావద్దని ట్రస్టువారిచ్చిన సర్క్యులర్‌తో మాకు కొంత నిరాశ కలిగింది. గత ఏడాదిగా మెహెరాబాద్‌కి వెళ్ళాలని ఎదురు చూస్తున్నాం. ఇంతలో ట్రస్టువారి లేఖతో ఖంగుతిన్నాం. తీరా అక్కడదాకా వెళ్ళాక ఎక్కడ వుండాలనే మీమాంశలో వున్నప్పుడు, మాకు ఆంధ్రా గెస్టు హౌసులో రెండ్రోజులు వుండటానికి అనుమతించారు. భోజనాలు మీరే ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఆ గెస్టుహౌసులో జీవిత సభ్యత్వంతోపాటు మాకంటూ ఒక సొంత గది కూడా వుంది. ఉండడానికి నీడనిచ్చిన బాబా తినడానికి కొదవ చేస్తాడా? అనుకుంటూ జనవరి 28న హైదరాబాద్ నుండి బొంబాయి ఎక్స్‌ప్రెస్ ఎక్కి, ఆ మర్నాడు మెహెరాబాద్‌కి చేరుకున్నాం. అక్కడున్న మూడ్రోజులూ మాకు ఏ విషయంలోనూ లోటు లేకుండా జరిగిపోయింది. ఎగువ మెహెరాబాద్‌లో బాబా సమాధి ప్రాంగణం కాలచక్రంలో ఓ 40 సంవత్సరాలు వెనక్కి తీసుకెళ్ళినట్లుంది. 1975-80 ప్రాంతంలో మెహెరాబాదులో ఏవీ దొరికేవి కావు. అలాగే జనవరి 31మ దర్శనం క్యూ దిగువన వున్న రైల్వే ట్రాక్ దాకా వుండేది. చరిత్ర పునరావృతమైందని అనుకున్నాం. మరోకోణంలో నాకొక విషయం గుర్తుకొచ్చింది. అదేమంటే, 1958లో మెహెరాబాద్‌లో బాబా స్వయంగా పెద్దఎత్తున సహవాస్ ఏర్పాటు చేశారు. ఆ సహవాస్‌లో భాగంగా విచ్చేసిన ప్రేమికులనందరినీ బాబా తనతోపాటు ఎగువ మెహెరాబాద్‌లో నేడు మనం చూస్తున్న సమాధి ప్రాంగణాన్ని దగ్గరుండి చూపించారు. **" మీరెంతో అదృష్టవంతులు. రాబోయే రోజుల్లో నా ఈ సమాధి ముంగిట దూరంగా నిలబడి దర్శనం చేసుకోవల్సిన పరిస్థితి ఎదురౌతుందన్నారు".** ఆనాటి సహవాసీలలో మా తండ్రి శ్రీ దీప్తి మహంతి శ్రీరామమూర్తి కూడా వున్నారు. ఆయన ధన్యుడు. ఈ మాదిరి దర్శన కార్యక్రమం ఇలాగే కొనసాగుతుందేమోనన్న బెంగ మాకే కాదు, చాలామందికి వుందనిపిస్తోంది.

# ఏకాంతవాసం

**(శ్రీమతి ఎస్.ఎస్. లక్ష్మి, కాకినాడ)**

ప్రభూ! ఏమిటి యీ ఏకాంతవాసం? ఎందుకు యీ ఏకాంతవాసం?
నిన్ను నీవు బంధించుకుని నీ దర్శనాన్ని నిషేధించావు.
ఇన్నాళ్ళు సరే! ఏదో జరుగుతోందిలే,
నీ ఇచ్ఛ, నీ సంకల్పం అని సరిపెట్టుకున్నాం.
కొన్నాళ్ళు మానవాళిని ఏకాంతవాసం చెయ్యమన్నావు.
మళ్ళీ ఏమిటి నీ ఏకాంతవాసానికి అర్థం?
51 వత్సరాలుగా నీ దర్శనంతో ఎందరో పునీతులయ్యారు.
నీ ప్రేమతత్త్వాన్ని అర్థం చేసుకుంటూ, చిన్నవో, పెద్దవో తప్పులు చేస్తూ
క్షమించమని ప్రార్థిస్తూ, నీ దర్శన భాగ్యం పొందుతూ
వెనక్కి వెనక్కి నడుస్తూ వెళ్ళలేక వెడుతూ, కన్నీళ్ళతో వీడ్కోలిస్తూ
నీ ప్రేమనుగొనిపోతూ గడిపాము. నెల కాదు, నెలలు గడిచి పోతున్నాయి.
ప్రేమికులపై నీకెందుకీ కినుక?
ఏమిటి నీ వ్యవహారం అంతుపట్టడంలేదు.
ప్రేమికులను దూరం పెడుతున్నావు, ఆత్మీయులను నీదరికి చేర్చుకుంటున్నావు!
లా అంటావు, చట్టం అంటావు
అతిక్రమించవద్దంటావు. భౌతికంగా మామధ్య ఉన్నప్పుడే నయం
అనంత బాధలను అనుభవిస్తూ కూడా చిరునవ్వుతో దర్శనమిచ్చావు.
అంతలో మా మధ్య నుండి ఇట్టే కనుమరుగయ్యావు.
మా హృదయాలలో నిన్ను దర్శించుకునే ప్రయత్నం చేస్తున్నాం.
నీ సమాధి దర్శనంతో తృప్తిని పొందుతున్నాం.
ఇప్పుడు హాయిగా విశ్రాంతి తీసుకుంటూ దర్శనమిస్తున్నావని ఆనందం.
ఏ భౌతిక బాధలు నిన్ను దరిచేరవని తలపోసాం.
ప్రతి అమరతిథికి విధిగా దర్శనానికి వచ్చే ప్రేమికులెందరో!
నీ సన్నిధిలో అంతులేని ఆనందంతో ఒకరినొకరు ప్రేమాలింగన కరస్పర్శలతో
నీ దర్శనంతో హృదయంలో శక్తిని నింపుకుంటున్నాం
కాని నేటి యీ నీ నిర్లిప్తతకు అర్థమేమిటి ప్రభూ!
ఇప్పుడీ ఏకాంత వాసమేమిటి? నీ ఏకాంతం మాకు పరీక్షా?
అలనాడు తొలిరోజులలో మండలివారి శిక్షణలో భాగంగా

నిన్ను నీవు బంధించుకున్నావు. ఉపవాసాలు చేసావు.
అలా మండలివారిని నీ చెప్పుచేతల్లో పెట్టుకున్నావు.
సరే! మండలి సుశిక్షుతులయ్యారు. విశ్వకార్యం ప్రారంభించావు.
కట్టావు, కూల్చావు ఆశ్రమాలు, నీ దరికి చేర్చుకున్నావు ఎన్నుకున్నవారిని
ఎన్నో కుటుంబాలు నీ ఆశ్రమంలో ధన్యులయ్యారు. ప్రేమకు అర్థం చెప్పావు.
ప్రేమించమన్నావు. తొలినాటి నుండి బాధలననుభవిస్తూన్నావు.
దానికి మా అజ్ఞానమే కారణమన్నావు. నిశ్శబ్దంగా ప్రేమ బీజాలు నాటావు.
మౌనంలో నీ వైభవాన్ని చూపావు. మస్తులనుద్ధరించావు.
క్షణం విశ్రాంతి లేకుండా. విశ్వకార్యంలో నిమగ్నమయ్యావు.
ప్రమాదాలను ప్రమాదంగా ప్రణాళికచేశావు
మానవాళి కొరకు కనీ వినీ ఎరుగని బాధలెన్నో భరించావు
భౌతిక, మానసిక, ఆధ్యాత్మిక యాతన లెన్నో భరించావు
మండలివారికి కాఠిన్యాన్ని, ప్రేమికులకు కారుణ్యాన్ని పంచావు.
ఏకాంతవాసాలు, ఉపవాసాలతో క్షణం తీరక ఉండేదికాదు.
మౌనంగా పర్యటనలు, ప్రమాదాలు భరించావు
ప్రభూ! మాకు నీ ప్రేమ, కరుణలే తెలుసు.
అంతులేని నీ బాధలను ఎరుగము. సరే పని పూర్తి చేసావు.
"నేనీ శరీరం కాదన్నావు" అనంతమైనబాధలతో నలిగి పోయావు
నిరంతర శిలువ వేత ననుభవించావు,
**Let us close the shop** అంటే ఇప్పుడే కదా తెరిచాము అన్నావు
సమయం సమీపిస్తోంది అన్నావు తెలుసుకోలేక పోయారు మండలివారు.
చివరకు శరీర త్యాగంతో మధుశాల తెరిచావు
నీదైన ప్రత్యేకతను నిలుపుకుంటూ విశ్రాంతిగా పడుకుని దర్శనమిస్తున్నావు.
సాకీ! నీ ప్రేమ మధువుకోరి వస్తున్నారెందరో! అంతలో మళ్ళీ ఏకాంతవాసమా?
ఈసారి అజ్ఞాతమా?
రోజులు, నెలలు, గడచిపోతున్నాయి. నీ దివ్య సమాధి దర్శనం కరువైంది.
ప్రేమికులపై ఎందుకీ కినుక? మౌన దినానికి రాకుండా మౌనంగా భరించాం
అమరతిథి కోసం యిన్నాళ్ళు ఎదురుచూశాం.
ఆ రోజు కూడా నీ దర్శన భాగ్యం పొందలేకుండా గడిచిపోవాల్సిందేనా?
ఏమిటిది ప్రభూ? ఎన్నాళ్ళీ ఏకాంతవాసం? ఎన్నాళ్ళకు పునర్దర్శనం?
నీ ఇచ్ఛే శాసనమై నడిపిస్తోందీ లోకాన్ని నీ ఇచ్ఛకు తలవంచి
ఇక్కడ నుండే ప్రణమిల్లుతున్నాం. మా ప్రణామాలు స్వీకరించు తండ్రీ!!

**మండలి సభ్యుడు**

# పెండూ -అస్పెండియర్



అస్పెండియర్ రుస్తుం ఇరాని...ఇదీ ఆయన అసలు పేరు. ఐతే, వ్యావహారికంలో, బాబా ప్రేమికులందరూ ఈయన్ని పెండూ అని పిలుస్తారు. పెండూ అనేది బాబా పెట్టిన నిక్ నేమ్. ఈ పేరు ఎలా వచ్చిందో కడదాకా చదవండి. అంతా మీకు అర్ధమౌతుంది. పెండూ తన చిన్నతనం నుండి బాబాతోనే వున్నాడు. సుమారు 60 సంవత్సరాలు బాబా సన్నిధిలో తన జీవితాన్ని ఎంతో విధేయతతో గడిపాడు. బాబా దగ్గర ఎక్కువకాలం గడిపిన మండలి ప్రేమికులందరిలో పెండూ అగ్రగణ్యుడనొచ్చు. 1903 ఆగస్టు 5న పెండూ జన్మించాడు. తండ్రి రుస్తుం ఇరానీ. ఈయన్ని మాసాజీ అని పిలుస్తారు. తల్లి పిరోజా. ఈమె షిరీన్‌మాయికి స్వయానా సోదరి. పూణేలో బాబావారి ఇంటి ప్రక్కనే వుండేవారు. బాబా తన చిన్నతనంలో వీరి ఇంట్లోనే ఎక్కువగా గడిపేవారు. పిరోజా ఆస్తమాతో బాధపడుతుండేది. అలాగే ఓ రోజున తీవ్ర ఆస్తమాతో ఊపిరాడక ఆమె పిన్న వయస్సులోనే తుదిశ్వాస వదిలింది. మాసాజీ తన ఇద్దరు పిల్లలు - పెండూ, నాజా గురించి చింతిస్తుంటే, వారిద్దరి బాధ్యత తాను చూసుకుంటానని, వారిద్దరూ తనవాళ్ళని బాబా ఆయనికి హామీ ఇచ్చారు. వారిద్దరూ తనతోనే వుంటారని భరోసా ఇచ్చారు. అప్పటికి పెండూ వయస్సు 14 సంవత్సరాలు. నాజాకి 10 సంవత్సరాలు. ఆ వయస్సులో పెండూకి ఆధ్యాత్మికతపై అంతగా ఆసక్తిలేకపోయినా, బాబా సమక్షంలోనే ఎక్కువగా గడపడానికి ఇష్టపడేవాడు. ఐతే, ఒక సందర్భంలో బాబాతో పాటు సాకోరిలోని సద్గురు ఉపాసనీ మహారాజ్ ఆశ్రమానికి వెళ్ళి, తిరిగి స్వస్థలానికి వెళ్తుంటే, మహారాజ్ మేర్వాన్‌ని చూపించి, ఈతను సామాన్యుడు కాదు. జొరాస్టర్ అంతటి గొప్పవాడని అన్నాడాయన. ఈ మాటలు పెండూ లేత మనస్సుపై చెరగని ముద్రవేశాయి. ఆ తర్వాత పెండూ చాలా సంవత్సరాల తర్వాత ప్రస్తుతం పాకిస్తాన్ దేశంలో వున్న క్వెట్టా పట్టణానికి వెళ్ళాడు. అక్కడ తమ బంధువులకు వున్న ఒక హొటల్‌లో నౌకరీలో చేరాడు. ఆ సమయానికి బాబా బొంబాయిలో మంజిలి-ఇ-మీం ఆశ్రమాన్ని నెలకొల్పారు. పెండూ తండ్రి మాసాజీ బాబా ఆశ్రమవాసిగా వున్నాడు. పెండూ తరచు తమ హొటల్‌కి కావల్సిన వస్తువుల కొనుగోలు కోసం బొంబాయి వస్తుండేవాడు. బాబా బొంబాయిలో వుంటున్నారని తెలుసుకున్న పెండూ ఒకసారి బాబాని చూడాలని మంజిల్ -ఇ- మీం వచ్చాడు.

బాబా ఆలింగనం పొందాక, ఏం చేయాలనుకుంటున్నావ్? అని బాబా పెండూని అడిగారు. "నీ దగ్గరనే ఉండాలని వుంది బాబా" అని క్లుప్తంగా పెండూ జవాబిచ్చాడు. అందుకు బాబా కూడా ఆనందంగా అంగీకరించారు. ఆనాటి నుండి తన తుదిశ్వాస వరకూ పెండూ బాబాతోనే గడిపాడు. ఇంతకీ ముందు చెప్పుకున్నట్లు ఆతని నిక్‌నేమ్ – "పెండూ" గురించి ఆసక్తికర విషయం తెలుసుకుందాం. అది 1920వ దశకం. మెహెరాబాద్‌కి దగ్గర్లోనే వున్న ప్రముఖ పర్యాటక స్థలం హ్యాపీవ్యాలీలో జరిగిందీ సంఘటన. ఈ సమయంలో బాబా తన మండలివారినందరిని తెల్లవారుఝామువనే లేచి ధ్యానం చేయమని ఆదేశించారు. ఇవేమీ అలవాటులేని పెండూ కళ్ళుమూసుకుని, గంటలు కొట్టే గోడ గడియారంలో లోలకం మాదిరి అటూ–ఇటూ తలతిప్పడాన్ని బాబా చూశారు. అప్పట్నుండి బాబా అతడి అసలు పేరుతో కాకుండా ముద్దుగా "పెండులం" అని పిలవడం మొదలెట్టారు. కాలక్రమంలో క్లుప్తంగా "పెండూ" గా ఆయన అందరికీ పరిచయమయ్యారు.బాబా అప్పగించిన ఏ పనినైనా కడదాకా పట్టుదలతో పోరాడి పూర్తిచేసే వ్యక్తిగా పెండూ గణుతికెక్కాడు. బాబా కోసం, ఆలాగే మండలివారికి అవసరమైన వసతి ఏర్పాట్లు, బాబా దర్శన కార్యక్రమ సమయంలో చేపట్టవల్సిన అన్ని ఏర్పాట్లు, ప్రధానంగా అవసరమైన కట్టుబడి నిర్మాణాలన్నీ పెండూ పర్యవేక్షణలో జరిగేవి. నేడు మనం మెహెరాబాద్‌లో చూస్తున్న అనేక నిర్మాణాలు – బాబా సమాధి, బాబా గది, దిగువ మెహెరాబాద్‌లోని మండలిహాలు ఇలా పలు నిర్మాణాలన్నీ బాబా ఆదేశాల మేరకు పెండూ కనుసన్నల్లోనే జరిగాయి. బాబాతో నవజీవనంలో పాల్గొన్న ముఖ్యమైనవారిలో పెండూ ప్రథముడు. ఒక్కమాటలో చెప్పాలంటే ఈ అవతారకాలంలో, తన చిన్ననాటి నుండి అనుక్షణం బాబాతోనే, ఆయన వెన్నంటి వున్న ధన్యుడు పెండూ. 1956 డిశెంబరులో సతారాలో జరిగిన కారు ప్రమాద సమయంలో కూడా పెండూ బాబాతోనే వున్నాడు. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలకు గురయ్యాడు. మెదడుకు కూడా గాయాలయ్యాయి. దాంతో ఆయన మాట దెబ్బతిన్నది. 1969 జనవరిలో బాబా దేహత్యాగం చేశాక, పెండూ పింపలగాంలో "బ్లూ బస్" ఎదురుగా కుర్చీలో కూర్చుని విచ్చేసే ప్రేమికులకు ప్రేమగా నవ్వుతూ, ఆయన ఇచ్చిన మృదువైన ఆలింగనం బాబా ప్రేమికులు ఎవరూ మరచిపోలేరు. ఆయన చెప్పే మాటలు ఓపిగ్గా ఆలకిస్తే, ఆయన జ్ఞాపకాల దొంతరల నుండి ఎన్నో ఆసక్తికర సత్యసందేశాలు దొరుకుతాయి. అవతారుని సన్నిధిలో, బాబాకు విధేయతగా నడుచుకోవాలనుకునే వారికి ఎంతో ధైర్యం, ఓర్పు కావాలని ఆయన చెప్పేవాడు. 1986 నవంబరు 7న పెండూ శాశ్వతంగా అవతారుని దరి చేరాడు. దిగువ మెహెరాబాద్‌లో మండలి సభ్యుల సరసన వున్న ఆయన సమాధిని ఈ దఫా వెళ్ళినప్పుడు తప్పక సందర్శించగలరు.



# అవతార్ మెహెర్‌బాబా జీవితచరిత్ర

**ఆంగ్ల మూలం: - భావూ కల్చూరీ, లార్డ్ మెహెర్,**
**వాల్యూం-3 (1925-29) - తెలుగుసేత: మల్లాది రామారావ్, మెహెరాబాద్**

***(గత సంచిక తరువాయి)***

అమెరికన్ దొర వాట్సన్ గారు ప్రస్తుతం లండన్ మహానగరంలో వున్నారు.
మెరిడిత్ ఆశ్రమం నుంచి స్వదేశానికి బయలుదేరారు. ఇది మొదటి మజిలి.
బస హోటలులో. బాబావారిని దర్శించడానికని మెరిడిత్ ఆశ్రమానికి
సతీసమేతంగా వెళ్ళాడు. ప్రభువుని దర్శించాడు. సందేహాలు నివృత్తి చేసుకొన్నాడు.
అమెరికా రమ్మని బాబావారిని ఆహ్వానించాడు కూడా.
అతగాడి మాటని కొట్టేయలేదు ప్రభువు సరికదా, వస్తాలే అన్నారు.
ఈ సంగతిని గుర్తుచేసుకుంటున్నది ఎందుకూ అంటే, అందుకూ కారణం వుంది.
ఇతగాడు లండన్ చేరిన రెండు రోజులకే బాబావారు వచ్చారు.
ఆ సంగతి యితని చెవిన పడింది. వెళ్దామా బాబా వారిని కలవడానికి,
అని అడిగింది శ్రీమతి. బదులు చెప్పలేదు కానీ, అతని ముఖకవళికలని బట్టి
ఆ యిల్లాలికి అర్థమయింది మగడి మనోగతం. ఇంక రెట్టించలేదు.
నీ మనసు ఎందుకు మారింది అనీ అడగలేదు.
దొర గారు తమ మనసులో మాట చెప్పలేదు.
పర్థమ్ గారు ఫోను చేశాడు వో రోజుని. మీకు తెలుసుగా పాఠక మహాశయా!
పర్థమ్ గారు వో ప్రముఖ పత్రికా రచయిత. 'ఎవ్విరిమాన్' ప్రతిక సంపాదకుడు.
ఉభయకుశలోపరి అయ్యాక, పర్థమ్ గారు బాబావారి గురించి ప్రస్తావించారు.
మీకు తెలుసుగా, బాబావారు యిప్పుడు లండన్‌లో వున్నారు", అన్నాడు.
బాబావారి అమెరికా యాత్రకి సాయపడమన్నాడు.

**వాట్సన్:** ఏమిచేయాలి?

**పర్థమ్ :** అబ్బే! పెద్దగా ఏమి చేయనక్కరలేదు మీరు.
లండన్‌లో అమెరికా దౌత్య అధికారికి వుత్తరం వ్రాస్తే చాలు.

**వాట్సన్:** ఏమి వ్రాయాలి.

**పర్థమ్ :** మెహెర్‌బాబా అమెరికా వస్తున్నారని వ్రాయండి.

బాబావారు తమ సహచరులతో వస్తున్నారు. మా ఆతిధ్యం స్వీకరిస్తారు.
మా స్నేహితులకి దర్శనమిస్తారని వ్రాయండి.

**వాట్సన్:** ఓహో! అలాగా! సరెలెండి చూద్దాం!

వాట్సన్ ధోరణి మన సంపాదకుల వారికి బుర్రకెక్కలేదు. ఇంతకీ వుత్తరం వ్రాస్తాడా? వ్రాయడా? అన్న మీమాంసలో పడ్డారు. మనం మెరిడిత్ ఆశ్రమంలో కలిసిన వ్యక్తి కాదీయన అని కాసేపటికి తెలిసివచ్చింది. అదీ ఏలాగున అంటే, మెరిడిత్ దొర గారి వల్లనే. అమెరికాలో బస ఎక్కడ అని ప్రశ్న ఎదురుకాగానే, ఇక్కడ, అక్కడ ఎందుకు, మన వాట్సన్ వున్నాడు కదా, అతని దగ్గరే దిగుదాము, అన్నాడుట.
అతగాడు ఏమంటాడో, అడిగి చూడకూడదూ అన్నారుట వొక మిత్రుడు.
మనమాట కాదనరని ధీమాగా అంటూ, వాట్సన్‌కి ఫోన్ చేశాడుట.

**మెరిడిత్:** మిత్రమా! అమెరికా వస్తున్నాము కదా!
బాబావారికి మీయింట ఆతిధ్యం యిస్తావా!
ప్రభువుతో పాటు నాకు కూడా!

**వాట్సన్:** నేనా! ఆతిధ్యమా! చిన్న యిల్లు మాది మిత్రమా!
మీ కంటూ వో గది కావాలి కదా. మాకేసరిపోని యిల్లు మాది
నా వల్ల కాదు బాబూ!

వాట్సన్ మాటకి షాక్ తిన్నాడు మెరిడిత్.
ఇంత నిర్మొహమాటంగా చెప్తాడా అని కుతకుత వుడికిపోయాడు కోపంతో.
నిన్న మొన్నటివరకూ మా దగ్గరే వున్నాడు బాబావారంటే పడిచచ్చిపోతున్నానన్నాడు.
ఆ ప్రేమ భక్తి ఏమయిపోయినై అని ముక్కున వేలు
వేసుకొన్నారు మెరిడిత్ ప్రభృతులు.
ఎవరు ఎప్పుడు ఎలా మారుతారో ఎవరికి తెలీదు.
తెలిసిన జగన్నాటక సూత్రధారి పెదవి విప్పడు.
చిరునవ్వులు చిందిస్తూ చోద్యం చూస్తున్నట్లు కనిపిస్తాడు ఎప్పుడూ!
భక్తి ఏదో బజారులో కొనుక్కొనే వస్తువు కాదు. కావాలి అంటె వచ్చి వొడిలో పడేదికాదు.
అక్కర్లేదు షో అంటే, చీదరించుకొంటూ దూరమయ్యేదీ కాదు.
భక్తి, భగవత్ప్రేమ ఎన్నో జన్మల తపస్సు వల్ల ప్రాప్తిస్తాయి.
సర్వాంతర్యామి కనికరిస్తే సంప్రాప్తిస్తాయి.
లేకపోతే, ఇదిగో వాట్సన్ గారికి మల్లే అవుతుంది.
భక్తి వుంటుందీ, వుండదు. చంచలమయిన మనస్సు అటూ యిటూ
గెంతులు వేస్తూ వుంటుంది. అయిన దానికీ కానిదానికీ బుర్రకి పని చెప్పేవాళ్ళ
గతి వాట్సన్ గతి అంటాడు వో సాధకుడు.

ఆ సంగతి, ఏమయినా, ఒకటి మాత్రం నిజం. మన అమెరికన్ దొరగారికి
అవగాహన చాలా తక్కువ. భగవంతుని పట్ల అవగాహన లేకుండా
సాధకుడు కాలేరు ఎవ్వరూ! పాపం, మన వాట్సన్ మహాశయుడికి భక్తికూడా
అంతంత మాత్రమే. మెహెరీశుని దర్శించినప్పుడు, ఈ ఇండియన్
గొప్ప వ్యక్తి అనిపించింది. మనిషి బుర్ర అనుమానాల పుట్ట కదా
అందుకని ఈయన నిజంగా దేవుడేనా అన్న సందేహం వచ్చింది.
దేవుడా అయితే ఇక్కడ మారుమూల ఎందుకున్నారు.
నలుగురి ముందుకీ రావాలి కదా! టీవీలో కనబడాలి కదా!
ఇటువంటి ఆలోచనలు రావడం ఆయన తప్పు కాదు.
భౌతిక వాదంలో మునిగితేలుతున్న అమెరికాలో పుట్టిన వాట్సన్ గారికి
ఇంతకంటే భిన్నమైన ఆలోచనలు ఎందుకువస్తాయి.
'అయ్యో! పాపం, అనుకోవాలి ఆయన్ని చూస్తుంటే!
వాట్సన్ గారికి మరో ధర్మసందేహం వచ్చింది.
మెహెర్‌బాబా ఎవరు? మనలాంటి మనిషి!
వో మనిషిని మరో మనిషి పూజించడమే మెహెరుని పూజించడమంటే
ఇది మంచి పనేనా? బుర్ర వేడి ఎక్కింది.
ఈ మాటనే డైరీలో వ్రాశాడావాళ. నేనీయనదగ్గరకి వచ్చింది దేనికి?
భగవత్ సాక్షాత్కారం కోసం. ఈ మహానుభావుడి వల్ల నాకేమి వొరుగుతుంది.
సాధకుల మార్గంలో అడ్డంకులు సృష్టిస్తాడేమో!
తన చుట్టూ అందరూ తిరగాలని ఈ అడ్డంకులు సృష్టిస్తాడేమో!!
చేస్తున్నది ఇదేగా! ఇలా సాగింది క్రైస్తవ మతంలో చర్చి పెద్ద అయిన
మన అమెరికన్ దొర గారి ఆలోచనా స్రవంతి.
మెరిడిత్ ఆశ్రమం కళ్ళ ముందు మెదిలింది అక్కడ,
అదే చల్లాకొంబ్‌లో బాబావారిని పూజించిన దృశ్యాలు గుర్తుకువచ్చాయి.
అబ్బ! ఏమిటి ఆ ఆర్భాటం! అనిపించింది
ఆ దృశ్యాలు మనోఫలకంపై కనబడగానే.
డోకు వచ్చింది. మెహెర్‌బాబా వారిపై భక్తి పుట్టలేదు.
పూజించాలనిపించలేదు. మెహెర్‌బాబా వారు దేముడు అవునో కాదో కానీ
ఆయన వల్ల తనకేమీ వొరగదనిపించింది.
అందుకనే మెహెర్‌బాబా వారిని లండన్‌లో దర్శించడానికి వెళ్ళలేదు.
"బాబా లండన్ వచ్చి వారం అయింది.
వో సారి చూసి వద్దామని", సతీమణి అంటే,

ఆ,వూ అన్నాడు తప్ప కదలలేదు. తెలిసో, తెలియకో వొకసారి దర్శించాను
మెహెర్‌బాబాని. అలానే ఆయన మనిషి మెరిడిత్‌ని కలిశాను.
వాళ్ళు నాకేమీ ప్రసాదించగలరో ఆ వరం యిచ్చారనుకొంటా.
ధన్యోస్మి. ముక్తి అంటారా? నా తిప్పలు నేను పడాలి.
నా దారి నేను వెతుక్కోవాలి.
ఈ బాబాలు, ఈ మెరిడెత్‌ల వల్ల వొరిగేది ఏమి లేదు.
మెహెర్‌బాబా దర్శనం కోసం తపిస్తూ వచ్చానిక్కడికి.
ఇప్పుడు ఎందుకు ఈ విముఖత ఆయన అంటే?
ఏమో నాకు తెలియదు. మనసులో మాట చెప్తున్నాను అంతే.
ఈ వేళ ప్రొద్దున్న కూడా వేసుకొన్నా ఈ ప్రశ్న
మెహెరీశుడు అంటే విముఖత ఎందుకు అబ్బ! అని.
మనసులో మాట చెప్తాను. బాబా వారిని చూస్తుంటే,
'రా, రమ్మని పిలుస్తున్నారని"పిస్తోంది.
ముక్తి దారిని చూపిస్తున్నారు.
భగవత్ సాక్షాత్కర మార్గం వైపు చూపిస్తున్నారు.
కానీ బాబావారి దారి నాదారి కాదనిపిస్తోంది.
నాకు తగిన మార్గం కాదు ఆ మార్గం అని నా మనస్సు చెప్తోంది.
మరి నేను ఏం చేయాలి! బాబావారి దారికి గుడ్‌బై చెప్పాలి.
నాదారిన నేను పోవాలి. నా దారి వెతుక్కోవాలి", అని
వాట్సన్ దొర గారు తమ డైరీలో వ్రాసుకొన్నాడు.
మెహెరీశుని దర్శించిన దరిమిలా, మన పర్డమ్ గారు,
తమ 'ఎవ్విరిమాన్' పత్రికలో ప్రభువు గురించి చాలా వ్యాసాలు వ్రాశారు.
సద్గురువు, సద్గురువు ఆవశ్యకత వంటి శీర్షికలలో సాగిన
ఆయన రచనలు చదివి చాలామంది ప్రభావితులయ్యారు.
మెహెరీశుని దర్శించాలని వువ్విళ్ళూరారు.
పర్డమ్ స్నేహితుడొకాయనకి కూడా యుగావతారుని కలవాలనిపించింది.
ఈ మహానుభావుడి పేరు చరిత్రకారుడు ఎందుకనో ప్రస్తావించలేదు ఎక్కడా.
అయినా పేరులో ఏముంది కనుక.
ఈ వ్యక్తి బాబావారిని సెప్టెంబరు 26న (1931) దర్శించాడు.
మనసులో మాట చెప్పాడు. 'ప్రభూ! నమ్మండి నమ్మకపోండి
మీ దివ్యదర్శనం కోసం పరితపిస్తోంది నామనస్సు' అన్నాడు.
ప్రభువు చిరుదరహాసం చేశారు.

నా కోరికని కొట్టేయకండి బాబా అన్నాడు. మనస్సులో మాట చెప్తున్నాను.
'ఎవ్విరిమాన్' పత్రికలో మీ గురించి చదివాక పుట్టిందీ తపన.
మిమ్మల్ని చూసి తీరాలనిపించింది. అందుకనే వచ్చాను అన్నాడు.
"సంతోషం" అన్నారు ప్రభువు. ఆధ్యాత్మికంగా ఎదగాలని కదా
నీ కోరిక. నీ అభీష్టం నెరవేరుతుంది. ధ్యానం చేయి రోజూ అన్నాడు.
ధ్యానం ఎలా చేయాలో వివరించారు. ఉన్నతోన్నతమైనది దైవీ ప్రేమ.
ఆ ప్రేమ సాధన కోసం ధ్యానం చేయమన్నారు.
మన పర్థమ్ మిత్రుడు తలాడించాడు. మీరు చెప్పినట్లే చేస్తానన్నాడు.
ఆధ్యాత్మిక ప్రపంచంలో బుర్రకి పనిలేదన్నారు. మనస్సుపెట్టి చేయి నీ ధ్యానం అన్నారు.
ఆధ్యాత్మిక పరిపూర్ణత గురించి ప్రస్తావించారు. ఆధ్యాత్మిక పరిపూర్ణత ఎంత వరకూ సాధించాము అని తెలుసుకొనే ప్రయత్నం చేయకు. అదొక వృథా ప్రయాస అన్నారు. నీ బుర్రకి అందని సంగతి అన్నారు. ఆధ్యాత్మిక పరిపూర్ణత నీ బుద్ది పరిధిలో లేదు అని స్పష్టం చేశారు. అలానే, ఆధ్యాత్మికంగా పరిపూర్ణత సాధించిన వారి దివ్య సముఖానికి ఎలా చేరగలడో విశదం చేశారు. నీ తెలివితేటల వల్ల,
అదే బుద్ధికి పదునుపెట్టటం వల్ల  చేరలేవు నీ గమ్యం అన్నారు.
బుద్ధిని బుద్ధిగా ప్రక్కకి పెట్టి దైవీ ప్రేమని సొంతం చేసుకో
అప్పుడే నీ లక్ష్యం నెరవేరుతుంది అని చెప్పారు. దైవీ ప్రేమ సంప్రాప్తించే మార్గాన్ని పేర్కొన్నారు పరిశుద్ధ హృదయంలో చిగురిస్తుందీ ప్రేమ అన్నారు.
మరి పరిశుద్ధ హృదయం కోసం ఏమి చేయాలి?
అసలు సిసలు భక్తుడు కావాలి సాధకుడు అని ప్రేమమూర్తి శెలవిచ్చారు.
తెలివితేటలు, వివేకం వల్ల మరో తంటా వుందన్నారు.
వీటివల్ల కొన్ని లక్ష్యాలు నెరవేరుతాయి. దారిలో కించిత్ గర్వం వస్తుంది కదా!
మరి అటువంటి వారికి ఆమడ దూరంలో వుంటుంది దైవీ ప్రేమ.
అటువంటి వ్యక్తుల్లో దైవీప్రేమ పుట్టించదని ఘంటాపథంగా  తేల్చి చెప్పారు.
ఇంకో మాట అన్నారు. మీ అంతరంగమే భగవన్నిలయం. అక్కడే వేస్తాడు సద్గురువు ప్రేమ బీజాన్ని. సద్గురువుతో సంపర్కం ఏర్పడగానే ఆయన మధుర ప్రేమగానం, సాధకుని గుండెల్లో మారు మ్రోగితుందన్నారు. ఇది సద్గురువు ప్రసాదం.
అదొక మహాద్భాగ్యం అన్నారు. సద్గురువు సందర్శనమే వొక వరమైతే, సద్గురువు చేసే మహాదివ్య జ్ఞానభోధ  మహావరం. ఇది ఎలా సంప్రాప్తిస్తుందో మెహెరీశుడు శెలవిచ్చారు.  అర్హులైన జీవాత్మలకే లభిస్తుంది సద్గురువుల అనుగ్రహం అన్నారు.
ఆ దివ్య పురుషులు వేస్తారు ప్రేమజ్ఞానపు బీజాన్ని. సాధకుని అంతరంగమే భగవన్నిలయం కాబట్టి, అక్కడే పడుతుంది బీజం అన్నారు. ఇంకో మాట శెలవిచ్చారు.

సద్గురువు ఎక్కువగా అంతః ప్రేరణకే ప్రాధాన్యం యిస్తారు

సాధకునిలో అంతః స్ఫూర్తి కల్గిస్తారు. ఈ ప్రేరణ, ఈ స్ఫూర్తి కల్గించడానికి ముందు ఏం చేస్తారో తెలుసా? నీలో, అదే సాధకునిలో ఆసక్తి రేకెత్తిస్తారు. ఉత్కంఠత కల్గిస్తారు, అంటూ బాబా వారు చెప్తూంటే, మన పర్థమ్ గారి స్నేహితుడు శ్రద్ధగా విన్నాడు. ఇవన్నీ కొత్త సంగతులు అతగాడికి. ఎక్కడా చదవలేదు. వినలేదు. అమ్మో అనిపించింది. అందుకనే తపీమని అడిగాడు "నన్ను ఏం చేయమంటారు ప్రభూ" అని.

మెహెరీశుడు ధ్యానం చేయమన్నాడు. ఆధ్యాత్మిక మార్గంలో అత్యున్నత లక్ష్యం దైవీ ప్రేమ. ఆ గమ్యసాధనే ధ్యేయంగా పెట్టుకో అన్నారు.

సాయం చేస్తానని హామీ యిచ్చారు. ఒక రోజున కొంతమంది బౌద్ధులు వచ్చారు ప్రభుదర్శనానికి. వాళ్ళకి నాయకుడు క్రిస్మస్ హంఫ్రీస్. బాబావారి గురించి కిమ్ చెప్పిందతనికి ఈ మహాత్ముడిని చూడాలి అనిపించింది. వెంటనే వచ్చాడు.

లండన్ బౌద్ధ సంఘానికి అధ్యక్షుడు అతగాడు. వెంట కొంతమంది బౌద్ధ మతస్తులు వచ్చారు. వారందరి ధర్మసందేహాలని ప్రభువు తీర్చారు చాలా వోపికగా.

అనేక ఆధ్యాత్మిక మర్మాల చిక్కుముడి విప్పారు.

భగవత్ సాక్షాత్కారానికి సద్గురువులు ఎలా సాయపడగలరో వివరించారు.

సూఫీ పరిభాషలో మతం గురించి ప్రస్తావించారు.

షరియత్, తారీఖత్, మారేఫత్, హఖీఖత్ అని నాలుగు  దశలు.

వీటిల్లో షరియత్ ప్రాపంచిక సంబంధమైనది. స్థూలంగా చెప్పాలంటే ఆచార వ్యవహారాల సంప్రదాయలు, నియమ నిబంధనల సమూహం షరియత్. వీటి పరిధిని దాటాలి సాధకుడు. అప్పుడే ఎదుగుతాడు ఆధ్యాత్మికంగా కానీ మహమ్మదీయుల దృష్టిలో షరియత్ పరిధిని దాటడం ధర్మ సమ్మతం కాదుట, అని మెహెరీశుడు పేర్కొన్నారు. మరి షరియత్  గురించి బాబావారి అభిప్రాయం యింత స్పష్టంగా వుంటే, తారీఖత్,  మారేఫత్, హఖీఖత్‌ల గురించి ప్రభువు ఏమంటారు?

భగవత్ సాక్షాత్కారం ఎప్పుడు లభిస్తుంది? ఏలాగ దొరుకుతుంది. ఈ ప్రశ్నలు సహజం. నేటి పాఠకులకి, అలనాటి శ్రోతలకీ బాబావారొకమాట అన్నారు.

భగవదనుభూతి సద్గురువు వరం. సద్గురు తలుచుకొంటే ఒక్క నిమిషంలో దివ్యానుభూతి సాధకుని సొంతం అవుతుందన్నారు. బాబావారి మాటలు వింటూ, బుర్రకి పదనుపెట్టి వో పెద్ద మనిషి దీర్ఘాలోచనలో పడ్డాడు. హంఫ్రీస్ వచ్చాడు. బాబావారి దృష్టిలో పడ్డాడు.

**ప్రభువు:** ఏమాలోచిస్తున్నావ్

**హంఫ్రీస్:** మీమాట  నమ్మబుద్ధి కావడం లేదు. మెహెర్‌బాబా ఒక్క నిమషంలో భగవద్దర్శనమా? ఎలా సాధ్యమౌతుంది?

**ప్రభువు:** వో మాట చెప్పనా! భగవదైక్యానికి నిమిషం కూడా అక్కర్లేదు. ఒక సెకెండ్ చాలు. అన్ని కర్మలనీ తుడిచి పెట్టేస్తే భగవదనుభూతిని కల్గించవచ్చు తక్షణమే. మాయా బంధం వుంటుంది ఎప్పుడూ. చేసే పనులవల్ల వస్తాయి కర్మ బంధాలు. కర్మలని నాశనం చేస్తే, బంధనాలు వుండవుకదా. ఏమంటావ్!! నీకిలా ఎవరు చెప్తారు? ఈ జన్మలోనే భగవత్ సాక్షాత్కారం దొరుకుతుందను కొంటున్నావా ఏమిటి? ఖంగుతిన్నాడు మన మిత్రుడు బాబావారలా సూటిగా ప్రశ్నస్తారనుకోలేదు. మీరు చెప్పిన కర్మ సిద్ధాంతం వినడానికి బాగుంది బాబా కానీ మీతో ఏకీభవించలేనని నిర్మొహమాటంగా చెప్పాడు. ఎదురు ప్రశ్న వేశాడు. కర్మల ప్రభావాన్ని ఒక్క జన్మలోనే తుడిచిపెట్టగలమా? ఇది ఎలా వీలవుతుంది అని అడిగాడు. ఈసారి ఎదురు ప్రశ్న బాబావారు వేశారు. ఎందుకు వీలుకాదు ఈ జన్మలోనే కర్మలప్రభావాన్ని తుడిచి వేయటం, అని అడిగారు. సద్గురువు కృప వుంటే చాలు, కర్మలని సమూలంగా నాశనం చేయవచ్చు అన్నారు. ఈ మాత్రం చేయకపోతే సద్గురువులు ఎందుకట దండగ అన్నారు నవ్వుతూ. ప్రతివాళ్ళు తమ వంతు కోసం ఎదురు చూస్తున్నా, ఆ మధుర క్షణం, అదే భగవదైక్యం కోసం నిరీక్షిస్తుంటే సద్గురువు కృపకి ప్రత్యేకత ఏముంది అన్నారు. తమ స్వీయానుభవాన్ని ప్రస్తావించారు. బాబాజాన్ కృపవల్ల తమకి క్షణంలో దివ్య చైతన్యం ప్రాప్తించిందన్నారు. అదే సద్గురువు కృప అంటే అన్నారు. కాలేజీలో చదువుతున్నాను. ఆధ్యాత్మిక సత్యాల గురించి వినలేదు. అనంత దివ్య చైతన్యం గురించి తెలీనే తెలీదు కానీ బాబాజాన్ ప్రసాదించిందీ.... నన్ను దగ్గరకి తీసుకొని ఆలింగనం చేసుకొంది. ఆ క్షణంలో నా జీవితం మారిపోయింది. నమ్ము, నమ్మకు పో, అప్పటి వరకు నేను వొక్క రోజు కూడా ఉపవాసం చేయలేదు. కానీ బాబాజాన్ ఆలింగనం తర్వాత మంచినీళ్ళు తప్ప యింకేమీ తీసుకోలేదు. ఒక్క రోజు, రెండు రోజులూ కాదు పదకొండు నెలల పాటు మంచి నీళ్ళపైనే వున్నాను. ఇంతేకాదు. నిద్రకూడా పోలేదు. కళ్ళు మూతపడేవికావు. గమ్మత్తు ఏమంటే, ఉపవాసం వుంటున్నానన్న భావన ఏకోశానా లేదు నాలో. అప్పట్లో నిద్ర పోవటం లేదనిపించ లేదు. అదంతా సర్వసాధారణ సంగతి అన్నట్లు ఆషామాషీగా జరిగింది. ఇదండీ నా అనుభవం. అందుకనే రూఢీగా చెప్తున్నా. ఏమని? ఏమని అంటే సాధకుల పాత కర్మలని చిటికెలో తుడిచి పెట్టేస్తారు సద్గురువులని. ఇది క్షణకాలపు పని సద్గురువులకి అని పేర్కొన్నారు. బుద్ధుడి అంశతో పునర్జన్మ నెత్తిన వారు అదే మన మధ్యన సశరీరంతో వున్న సద్గురువు ప్రసాదించగలడీ దైవానుభూతిని. అదీ రెప్పపాటు కాలంలో అని ఆ బౌద్ధమతస్థులకి వాళ్ళ పరిభాషలో వివరించారు బాబావారు.

**-సశేషం**

# గుంటూరులో బిడి గారింట్లో భోగి వేడుకలు

భోగి పండుగ సందర్భంగా ప్రతి ఏడాది మాదిరి 2021 జనవరి 13న శ్రీ బి.డి. నరసింహారావు గారి ఇంట్లో అవతారునికి భోగి పండుగ వైభవంగా జరపడమైనది. ప్రేమికులు బాబాకు భోగి పండ్లు సమర్పించారు. హాజరైన చిన్నారులకు బాబా తరఫున భోగి పండ్లు పోయడమైనది. ఈ సందర్భంగా ఏర్పాటైన సత్సంగ్ కార్యక్రమంలో శ్రీ బి.వి.కృష్ణ మెహెర్, శ్రీ బేగ్ తదితరులు బాబా సత్యప్రేమ సందేశాలపై ప్రసంగించారు.

# 52వ అమరతిథి వేడుకలు

అవతారుని అమరతిథి వేడుకలు తెలుగునాట గల అన్ని బాబా కేంద్రాలలో ఎంతో వేడుకగా జరుపుకున్నారని స్థానిక కేంద్ర నిర్వాహకులు విడుదల చేసిన ప్రకటనలో తెలియజేశారు. శ్రీకాకుళం నుండి ఆదిలాబాద్ జిల్లా దాకా గల రమారమిన గల 200 బాబా కేంద్రాలలో అమరతిథి వేడుకలు కోవిడ్ నిబంధనలను పాటిస్తూ కడు రమ్యంగా నిర్వహించుకున్నట్లు సమాచారం అందజేశారు. కాగా, నరసన్నపేట కేంద్రములో అమరతిథి వేడుకలు ఘనంగా జరుపుకున్నట్లు కార్యదర్శి శ్రీ సూర్యం, శ్రీ మెయ్యి బోగేసు తెలిపారు. అవతారుని సప్తవరణ పతాకాన్ని అధ్యక్షులు శ్రీ తాతబాబు ఎగురవేశారన్నారు.

## వెంకట్రావ్‌పేట

మంచిర్యాల జిల్లా వెంకట్రావ్ పేట గ్రామంలో అవతారుని 52వ అమరతిథి వేడుకలు కోవిడ్ నిబంధనలు పాటిస్తూ ఘనంగా నిర్వహించినట్లు సహాయ కార్యదర్శి శ్రీ తోట మల్లయ్య ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక గ్రామస్తులు రమారమిన వెయ్యి మంది ఈ కార్యక్రమంలో పాల్గొని అవతారుని దర్శనం పొందారని ఆయనన్నారు.



# బాబా ప్రేమికుని అంతరంగము

-ఎం.ఎస్.మణి, మచిలీపట్నం

ఆద్యంతరహితుడైన అవతార మెహెరు ప్రభువు
తన అవ్యాజమైన కృపావీక్షణతో
ప్రతివారిలో తన ప్రేమానురాగాలను వికసింపజేసి
తన ప్రేమికులకు ప్రేమానుభూతిని అందించిన
ఆ దేవదేవునికి వందనం అభివందనం పాదాభివందనం.
అంతరాంతరాలలో వెలుగొందే ఆ దివ్యజ్యోతి కాంతిలో
సుందర నందనోద్యాన వనంలో మధ్య మధ్య ముళ్ళున్నా
అందమైన పూలబాటలాంటి ప్రేమబాటలో
విహరించే అనుభూతిని పొందుటకు
మెహెరు దేవుని పాదాల చెంత ధూళిగా మారుటకు ఆయన కృప కోసం
ప్రేమికులెల్లరు జీవించడమే ధ్యేయంగా మలచుకోవాలి.
మమతానురాగాలకు చిక్కుకొని జన్మజన్మల కర్మానుబంధాలను చుట్టుకొని
మనుగడ సాగే జీవులు నిస్వార్థపరంగా బాబా కరుణా వీక్షణకు పరితపించాలి.
విశ్వానికే అధినేతయైన మన మెహెరు ప్రభుని
కరుణాసాగరంలో మునిగి యీదులాడుతున్న వారిని
అపారమైన దయతో తన అక్కున జేర్చుకొని
తరింపజేసిన ఆ దేవదేవుని సన్నిధికి చేరిన వారు ఎంతో ఎంతో ధన్యులు.
హృదయాంతరాలలో అంతర్వాహినిలో వెలువడే
అంతర్వాణియై వెలుగొందే అక్షరసత్యాలే
బాబా మనతో పలికే పలుకులు.
సంస్కారాల ప్రభావంతో మనసు మాయ జేసే
ఇంద్రజాలాన్నించి బయటపడాలంటే
బాబాచే ప్రేరేపింపబడిన హృదయభాషణకు మనం ఎంతో విలువ నివ్వాలి.
ఆ విలువను పొందాలంటే
సదా బాబా స్మరణతో మనసును పునీతం చేసుకొవాలి.

***

## తుమ్మపాల కేంద్రం 9వ వార్షికోత్సవం

అవతార్ మెహెర్‌బాబా కేంద్రం, తుమ్మపాల 9వ వార్షికోత్సవ వేడుకలు 2020 డిశెంబరు 25 ఘనంగా నిర్వహించినట్లు సెంటర్ అధ్యక్షులు శ్రీ రాపర్తి వెంకటరావు, తెలిపారు. ముఖ్యఅతిధిగా శ్రీ శివయ్య అనకాపల్లి కేంద్రం సప్తవర్ణ పతాకావిష్కరణ చేశారు. అనంతరం జరిగిన ప్రేమిక్ సహవాస్‌లో శ్రీ శివయ్య, కుమారి మాధవీలత జల్లు వెంకటరమణ, బాబా సందేశాలపై ప్రసంగించారు. నాగపూర్‌కు చెందిన అభయ్ ఉబాలే, పర్వ ఉబాలే, ఆర్య ఉబాలే, బొబ్బిలికి చెందిన గుణ, తుమ్మపాల, అనకాపల్లి, చోడవరం, గాజువాకలకు చెందిన మెహెర్‌బాబా ప్రేమికులు, అవతారుని గీతాలను ఆలాపించారు. ఈ కార్యక్రమంలో మొగసాల వెంకట్, గండేపల్లి వేంకటేశ్వరరావు, గండేపల్లి కొండలరావు, మొగసాల నాగు, మంత్రి పాహిమ, గండేపల్లి లక్ష్మమ్మ, నాగరత్నం తదితరులు పాల్గొన్నారు.

## కామారెడ్డి కేంద్రంలో ఏకనామం.

2021 ఫిబ్రవరి 14 ఆదివారం నాడు ఉదయం 7 నుండి మధ్యాహ్నం 2 గంటల వరకూ మెహెర్‌బాబా ఏకనామం ఘనంగా నిర్వహించినట్లు స్థానిక ప్రేమికులు ఒక ప్రకటనలో తెలిపారు.

# బాబాలో ఐక్యం

బాబా ప్రేమికులు శ్రీ పెద్దమల్లు సుబ్రహ్మణ్యం, రాజమండ్రి 2021 జనవరి 20న శ్రీ కె. పాండురంగ స్వామి, హైదరాబాద్ 2021 ఫిబ్రవరి 3న, శ్రీ బెహెరా వెంకట రమణ, విశాఖపట్నం ఫిబ్రవరి 10న, శ్రీమతి సీతమ్మ, విజయవాడ ఫిబ్రవరి 18న బాబాలో ఐక్యమయినట్లు స్థానిక బాబా ప్రేమికులు తెలిపారు. బాబా కార్యక్రమాలలో చురుకుగా పాల్గొనే వీరు నిరంతరం బాబా నామస్మరణలో గడిపేవారని స్థానిక ప్రేమికులు తెలిపారు.


శ్రీ పెద్దమల్లు


శ్రీ స్వామి


శ్రీ బెహెరా


శ్రీమతి సీతమ్మ

# మెహెరాబాద్ తెలుగు-గుజరాతీల సహవాస్

## 1958 ఫి(బ్రవరి 21 నుండి 26 వరకూ

**(గత సంచిక తరువాయి)**

ఇంతలో ఒక సహవాసీ లేచి నిజమైన నేను, అబద్ధపు నేను గురించి (ప్రస్తావిస్తూ, నా దేహాన్ని నిజమైన దేహం అని అంటారా? అని తన అనుమానాన్ని లేవనెత్తాడు.
బాబా నవ్వుతూ...లేదన్నారు.
నీ ద్వారా అబద్ధపు నేను ఈ (ప్రశ్న అడిగించిందన్నారు.
నేను ఫలానా... నాకు ఆకలిగా వుంది, నాకు నిన్న రా(త్రి ని(ద్రలేదు,
ఇది నా కుటుంబం, నా డబ్బులు, నా ఆస్తి పోగొట్టుకున్నాను...
ఇదంతా అబద్ధపు నేను నీ ద్వారా చెప్పిస్తున్న మాటలని బాబా అన్నారు.
ఇందులో నీ సూక్ష్మ, స్థూల మానసికి దేహాలున్నాయన్నారు బాబా.
నా (ప్రవచనాన్ని అనువదిస్తున్న వారు, వింటున్నవారు, ఇలా అందరూ
ఈ అబద్ధపు నేనులో వున్నారు. ఉదాహరణగా సహవాసీలలో వున్న
ఏల్చా ముస్లిం మతస్తుడనుకుందాం. అది ఆతని అబద్ధపు నేను.
ఆతను అల్లాను భగవంతునిగా ఆరాధిస్తాడనుకుందాం!.
ఆతని (ప్రార్థనా సమయంలో ఆతను అనేక (ప్రాపంచిక విషయాలపై అంటే
తన కుటుంబం, ఉద్యోగం, వ్యాపారం, తదితర అంశాలపై ఆతని ఆలోచనలు
వున్నాయనుకుంటే, ఏల్చా తనలోని నిజమైన నేను (ప్రార్థించకుండా,
అనేక రూపాల్లో వున్న "అబద్ధపు నేను"ని ఆతను ఆరాధిస్తున్నట్లని
బాబా స్పష్టం చేశారు. ఈ అంశంపై సహవాసీలలో వున్న
శ్రీ మొసలికంటి తిరుమలరావు గారు ఏరుచ్ ఇంగ్లీషులో చదివిన మాటల్ని
తెలుగులో అనువదిస్తుంటే, బాబా తీక్షణంగా తన విశ్వ ఆధ్యాత్మిక కార్య(క్రమంలో
వున్నట్లు కనిపించారు. బాబా తన చేతి వేళ్ళను వేగంగా కదుపుతూ,
దేనినో తరిమివేస్తున్నట్లు సంజ్ఞలు చేస్తూ కనిపించారు.
కొన్నిసార్లు ఎవరినో పిలుస్తున్నట్లూ, ఏవో ఆదేశాలు ఇస్తున్నట్లు కనిపించారు.
ఒక సమయంలో తన దర్శనాన్ని తాను చేసుకున్నట్లు,
మరోసారి ఎవరినో ఓదారుస్తున్నట్లు,

మరొకసారి కొందర్ని కొద్దిసేపు వేచివుండమని ఆదేశిస్తున్నట్లు కనిపించింది.
బాబా ప్రవచనాన్ని గుజరాతీలో అనువదిస్తున్న బర్‌జోర్ మెహెతా
**"భక్తికి"** పర్యాయపదంగా **"ప్రేమ"** అని చెప్పినప్పుడు,
బాబా మధ్యలో కలగజేసుకుని ఈ రెంటికీ నడుమ చాలా బేధం వుందని
బర్‌జోర్ చెవిమెలిపెట్టి, ఆపై బాబా తన వివరణ ఇలా ఇచ్చారు.
**"ప్రేమకు – భక్తికి"** హస్తిమశకాంతర బేధం వుందన్నారు.
హస్తి అంటే ఏనుగు. మశకం అంటే దోమ.
ఈ రెంటి నడుమ ఎంతో బేధం వుంది.
అలాగ ప్రేమకు – భక్తికి నడుమ అంత వ్యత్యాసం వుందన్నారు.
ప్రేమను ఎప్పుడూ భక్తితో పోల్చవద్దన్నారు.
భక్తిలో సంపూర్ణంగా మునిగి తేలాక అంటే
భక్తికి పరాకాష్ఠ – "ప్రేమ" అనొచ్చు అన్నారు. ప్రేమ అత్యున్నతమైనది.
అత్యంత ఉన్నతమైన భక్తిని ప్రేమ అనొచ్చు అని బాబా వివరించారు.
బాబా ఇంకా ఇలా అన్నారు.
ఒక బాబా భక్తుడు తన భక్తితో తన సర్వస్వం అర్పించి
తనకూ – భగవంతునికీ నడుమ ఎలాంటి బేధం లేదనుకునే స్థాయిని
చేరాడనుకుందాం. అ స్థితిలో బాబాకు ఆతనికి నడుమ ఎలాంటి అడ్డుతెర
వుండదని బాబా అన్నారు. మీరందరూ ఆ స్థితికి చేరామని ఊహించకండని అంటూ,
ఆ అంశాన్ని నవ్వుతూ ముగించారు.
ఆధ్యాత్మిక పథంలో ప్రేమ మూడవ మార్గానికి చెందిందన్నారు.
కాగా, మొదటి మార్గం ఏమంటే ఇతర అబద్దపు నేనులకు సేవ చేయడం,
అబద్దపు నేనును ఆరాధించడం రెండవ మార్గమని బాబా సూచించారు.
ఆధ్యాత్మిక మార్గంలో పయనించేవారికి ప్రేమ అత్యుత్తమమైనది.
కాబట్టి నేను చెప్పేమాటల్ని శ్రద్ధగా ఆలకించండి.
తమ సర్వస్వాన్ని త్యజించి, బాబావారి పాదధూళిగా మారేవారు
చాలా కొద్దిమంది మాత్రమే వుంటారు.
నన్ను ప్రేమించదల్చినవారికి నేను కొన్ని సూచనలు చేశాను.
ప్రేమ అంటే ప్రేమనే అన్నారు.
ఇందులో ఎలాంటి తారతమ్యతలకు తావు లేదన్నారు.
ప్రేమికుడు తన ప్రియతముడి ఇచ్ఛ ప్రకారం నడుచుకోవాలి.
అన్నివేళలా ప్రియతముడ్ని సంతోషంగా వుంచడానికి ప్రయత్నించాలని బాబా అన్నారు.
నన్ను కనుక మీ ప్రియతముడిగా అంగీకరిస్తే,

నా కోరిక – నా ఇచ్ఛ ఏమిటి? అనే దానిపై వివరణ ఇస్తూ ఇలా అన్నారు.

1. నీ బాధ్యతలను విస్మరించవద్దు.
   నీ ఇల్లు, కుటుంబం, ఆఫీసు, ఉద్యోగం, ఇతరత్రా ఏవీ త్యజించవల్సిన పనిలేదు.
2. నీ ప్రాపంచిక విధులన్నింటినీ సక్రమంగా హాజరవుతూనే,
   దీనికంతటి వెనుక బాబా వున్నాడన్న సంగతి గుర్తుంచుకోమన్నారు.
3. నీవు సంతోషంగా వున్నప్పుడు, బాబా నన్నిలా సంతోషంగా వుంచారనుకో.
   అలాగే, కష్టాలు ఎదురైతే, బాబా నన్నిలా కష్టాలను ఎదుర్కోమన్నారని భావించు.
4. అన్ని విషయాలు బాబాకు వదిలిపెట్టి,
   "ఈ స్థితిలో నన్నిలా బాబా వుంచాడని, నిజాయితీతో, త్రికరణశుద్ధిగా ఆలోచించు.
5. బాబా అందరిలో, అన్నింటా వున్నాడన్న తలంపుతో,
   ఇతరులకు సహాయపడటానికి, సేవచేయడానికి ప్రయత్నించు.

బాబా ఇంకా ఇలా అన్నారు. నా దివ్యాధికారంతో మీ అందరికీ చెబుతున్నానన్నారు. అదేమంటే, ప్రతిఒక్కరూ, ఎవరైనాసరే, వారి తుదిశ్వాస వదిలే సమయంలో నా నామాన్ని తలుచుకుంటే, వారు శాశ్వతంగా తనను చేరుకుంటారని ప్రకటించారు. ఇప్పటినుండి నా నామాన్ని నిరంతరం తలుచుకోవడం అలవరుచుకోకపోతే, మీ ఆఖరిక్షణాల్లో నా నామం గుర్తుంచుకోవడం కష్టమౌతుందని బాబా హెచ్చరించారు. రోజు మొత్తంలో కనీసం ఒక్కసారైనా హృదయపూర్తిగా నా నామం తలుచుకునే అలవాటు చేసుకోండని బాబా హితవు చెప్పారు.
అనంతరం, ఆ అంశాన్ని అంతటితో ముగిస్తున్నట్లు ప్రకటించారు.
ఇక ఈ రోజుకు ఆధ్యాత్మిక విషయాలకు స్వస్తి పలుకుదాం.
ఆపై కొద్దిసేపు ప్రాపంచిక విషయాలపై కొద్దిసేపు ముచ్చటించుదాం అన్నారు.
ఇప్పుడు టైం ఉదయం 10.45 అయ్యింది.
రేపు నా పుట్టినరోజు సందర్భంగా నా పాదపూజ నిర్వహించడానికై స్త్రీ, పురుషులు ఒక్కొక్కరు 12 మంది చొప్పున 24 మంది ఎంపిక చేసుకోమన్నాను. ఈ విషయమై మీలో మీరు వాదులాడుకుని, ప్రతిఒక్కరూ పాదపూజలో పాల్గొనాలనుకున్నారు. మీలో మీకు ఏకాభిప్రాయం లేదు.
అలాగే ఈ విషయంపై మీలో మీకు అభిప్రాయబేధాలు తలెత్తాయని నాకు తెలిసింది.
ఐతే, ఈ సమస్యకు నా దగ్గర ఒక పరిష్కారమార్గం వుంది.
అది అందరినీ తృప్తి పరుస్తుందనుకుంటున్నాను.
అదేమిటో చెప్తాను. శ్రద్ధగా ఆలకించండని బాబా ఇలా అన్నారు.

**– అదేమిటో వచ్చే సంచికలో. సశేషం**

## నాటిక

# కరుణామయుడు మెహెర్‌బాబా

**- శ్రీ వల్లూరి నాగేశ్వరరావు (వనారా)**

**ఇందు పాత్రలు -1. గులాబ్ దాస్ (60) 2. నీరుమతి (55) 3. పిల్లవాడు (10)**

**ప్రయోక్త** గులాబ్‌దాస్, నీరుమతి చక్కని దంపతులు. వాళ్ళు మెహెర్‌బాబాను అత్యంతముగా ప్రేమించే ప్రేమికులు. వారు ఒక అపార్టుమెంటులో నివాసముంటున్నారు. వారింట్లో బాబా భజన పెట్టుకొని అందరిని ఆహ్వానిస్తూ వుంటారు. కానీ భజనకు ఎవరు రాకపోవటంతో ఆ దంపతులిద్దరూ బాబాకు మొర పెట్టుకున్నప్పుడు ఏమి జరిగిందో ఈ నాటిక ద్వారా తెలుసుకుందాం.

**అలంకరణ:** మెహెర్‌బాబా ఫోటో వుండాలి. టేబుల్, కుర్చీలు, కింద పరుచుకునే జంపఖానా, కొన్ని పాత్రలుండాలి.

**నీరుమతి:** ఏవండి మన యింట్లో బాబా భజన పెట్టుకుంటున్నాం కదా. ఈ అపార్ట్‌మెంటులో వున్న వాళ్ళందరిని భజనకు రమ్మని పిలుద్దామండి.

**గులాబ్‌దాస్:** తప్పకుండా నీరుమతి... ఆవిధంగానైనా వాళ్లందరికి మెహెర్‌బాబా నామం విన్పించిన వాళ్లమవుతాం

**నీరుమతి:** నిజమేనండి సాక్షాత్తు భగవంతుడు మెహెర్‌బాబా రూపంలో అవతరించి సర్వ మానవాళి హృదయాల్లో తన ప్రేమను అందిస్తున్నాడు.

**గులాబ్‌దాస్:** అవతార పురుషుడైన బాబా మన యెడల ఎంత కరుణతో ఈ భువిపై వెలిసినాడు. నేల నాలుగు చెరుగులా తిరిగి తన ప్రేమ బీజాలు నాటాడు. ప్రతి హృదయాన్ని మేలుకొల్పాడు. మస్తు జనోద్ధరణ గావించాడు. కుష్టు,కుంటి రోగులకు ఎంతో సేవ చేసాడు.

**నీరుమతి:** అవునండి! బాబా వారు చేసిన ఎన్నో మహోన్నతమైన కార్యక్రమాలున్నవి. అందులో నవజీవన కార్యక్రమం ఎంతో విశిష్టమైనది. తన శిష్యులతోపాటు తాను కూడా ఒక సహచరుని వలే బిక్షాటన చేస్తూ తన లీలా వైభవాలను చూపుతూ తన దైవత్వాన్ని సర్వులందరికి తెలియపరిచారు.

**గులాబ్‌దాస్:** ఏది ఏమైనా నీరుమతి, భగవంతుని దివ్య ప్రణాళికలో ప్రతి అంశం గొప్పదే. ఈ అవతారయుగంలో తన ఈశ్వరీయ మౌనం ద్వారా ఎన్నో హృదయాలకు జ్ఞాన భిక్ష పెడుతున్నారు. ఆ మౌనంతో ఎన్ని వేదాంత విషయ రహస్యాలు వెలికి తీసి సామాన్య ప్రజలకు అర్ధమయ్యే రీతిలో అందించారు. బోధించుటకు రాలేదంటూ ప్రతీది చెప్పి ఆధ్యాత్మికమంటే ఏ యోగసాధనలలో, కర్మకాండలలో లేదంటూ సర్వులను ప్రేమించుటలోనే ఉందంటూ, భగవంతుడు ఎక్కడో లేడంటూ ప్రతీ హృదయంలోనే ఉన్నాడంటూ చెప్పిన ఏకైక దైవం మెహెర్‌బాబా ఒక్కరే.

**నీరుమతి:** నిజమేనండి! మెహెర్‌బాబా ఈ యుగంలో అన్ని ఆధ్యాత్మిక విషయాలను అందరికి అర్థమయిన రీతిలో చెప్పారు. ఆచరించుట ద్వారా నీలో వున్న దైవత్వాన్ని తెలుసుకుంటావు అన్నారు బాబా.

**గులాబ్‌దాస్:** నీరుమతి మనం అందరి దగ్గరకు వెళ్ళి అందరిని బాబా భజనకు రమ్మని పిలవాలి కదా.. పద... వెళ్దాం....

**నీరుమతి:** అలాగే నండి... అంటూ వెళ్తారు..

**తెరవెనుక:** జైబాబా అండి ఈ రోజు సాయంత్రం 6గంటలకు మా యింట్లో మెహెర్‌బాబా భజన పెట్టుకుంటున్నాం. మీరు, మీ కుటుంబ సభ్యులంతా రావాలి..

**ఒకామె:** తప్పకుండా వస్తాం...

**యింకో ఆమె:** అయ్యో! మీరు చెప్పడం మేము రాకపోవడమా తప్పకుండా వస్తాం...

**మరొకామె:** తప్పకుండా వస్తాం...(అలా కొంతమంది ఆడవాళ్ళు, మగవాళ్లు చేత ఆ విధంగా లోపలి అన్పించాలి)

(తెర తీయబడును)

**గులాబ్‌దాస్:** నీరుమతి చెప్పిన వాళ్లంతా భజనకు వస్తానన్నారు. బహుశా ఎక్కువ సంఖ్యలోనే వచ్చేటట్టు ఉన్నారు. కాబట్టి ప్రసాదాన్ని ఘనంగా చేయాలి. మరి, నువ్వు ఆ హడావిడిలో వుండు. ప్రసాదానికి కావలిసిన సరుకులు లిస్టు యిస్తే అవ్వన్నీ బజారుకెళ్లి తీసుకు వస్తాను.

**నీరుమతి:** అదెంతసేపు చిటికెలో చెప్పేస్తాను. రాసుకోండి. అయిదు కేజిలు గోదుమ రవ్వ, పది కేజీలు చక్కెర, అందులో రెండు కేజిలు జీడిపప్పు, మరో రెండు కేజిలు కిస్‌మిస్, మూడు కేజిలు నెయ్యి పట్టుకొని రండి. బాబాకి యిష్టమైన హల్వా చేస్తాను.

**గులాబ్‌దాస్:** యిప్పుడే పచారికొట్టుకు వెళ్ళి తెస్తాను. నువ్వు గాబరా పడకుండా బాబా భజన చేసే చోట అంతా శుభ్రం చెయ్యి. వచ్చే వాళ్లు కూర్చోవడానికి కింద పరదాలు పరిచి ఒక కూజాతో నీళ్లు పెట్టు... వచ్చేటప్పుడు బాబాకి యిష్టమైన గులాబీ పువ్వులు తెస్తాను...

**నీరుమతి:** అబ్బబ్బ మీరు వెళ్ళండి. అవన్నీ నేను చూసుకుంటాను కదా... మీరు గాబరాపడి నన్ను గాబరా పెట్టకండి. గబగబా వెళ్ళి వెంటనే తీసుకురండి

**గులాబ్‌దాస్:** అలాగేలేవే.. వెళ్తున్నాను కదా..(అటు యిటు తిరుగుతూ ఏదో మరచినట్టు)

**నీరుమతి:** అబ్బ. మీరు వెళ్లిరండి. భజనకు వేళ అవుతుంది.
అందరూ వచ్చేస్తారండీ..

**గులాబ్‌దాస్:** యిదిగో వెళ్తున్నాను. (అంటూ బయటికి వెళ్లిపోతారు)
(నీరుమతి బల్లపైన బాబా ఫోటో పెట్టి చక్కగా అలంకరణ చేస్తూ వుంటుంది)

**గులాబ్‌దాస్:** నీరుమతి! నువ్వు చెప్పిన సరుకులన్ని తెచ్చాను. నువ్వు యిక ప్రసాదం పనిలో వుండు. నేను బాబాకు అలంకరణ చేస్తాను.

**నీరుమతి:** అయితే మీరు యిక్కడ వుండి బాబాకు అలంకరణ చేయండి. కింద పరదాలు పరచండి. నేను వంటింట్లో ప్రసాదం పని చూస్తాను. (అంటూ లోపలికి వెళ్లి పోతుంది).

**గులాబ్‌దాస్:** (బాబా ఫోటోకు అలంకరణ చేస్తూ చిన్న బాబా పాట పాడుకుంటాడు) నీరుమతి నువ్వు చేస్తున్న ప్రసాదం వాసన యిక్కడకు వస్తోందోయ్. మంచి ఘుమఘుమలాడిపోతుందనుకో. ఆ వాసన నా ముక్కుకు తగిలి మరింత సువాసన భరితమై పోతుందనుకో...

**నీరుమతి:** మరేటనుకున్నారు. యిది బాబా ప్రసాదం... అందులో బాబా ప్రేమ యిమిడి వుంది. తెలిసిందా...

**గులాబ్‌దాస్:** ప్రసాదం అయిపోయింది కదా. ...యిక రా!!
బాబా భజన మొదలు పెడదాం..

**నీరుమతి:** అలాగేనండి...(ఇద్దరూ బాబా పాటలు పల్లవి, చరణాలు పాడుతుంటారు ఎవరైనా వస్తున్నారేమోనని వెనక్కి చూస్తూంటారు. ఎవరు రావటం లేదు. మరో రెండు పల్లవిలు పాడుతుంటారు అయినా ఎవరు రావటం లేదు)

**నీరుమతి:** ఏవండి! మనం పిలిచిన వాళ్లు ఎవరు కూడా భజనకు రాలేదండి. ప్రతివారి యింటికి వెళ్లి మరీ పిలిచాం. అందరూ వస్తామని చెప్పారు కూడా...

**గులాబ్‌దాస్:** పోనిలే నీరుమతి.. బాధపడకు.. బాబా వాళ్ళకు యింకా అవకాశం యివ్వలేదు... మరొకసారి వస్తారేమో.

**నీరుమతి:** అయినా అందరూ వస్తారని బోలెడు ప్రసాదం చేసాం. యిప్పుడు ఈ ప్రసాదాన్ని ఏమి చేయాలి...

**గులాబ్‌దాస్:** నువ్వేమి దిగులుపడకు... ఆ ప్రసాదాన్ని వాళ్ళ యిళ్ళకు వెళ్లి పంచుదాం. వాళ్ళు రాకపోయినా బాబా ప్రసాదాన్ని యిస్తే సంతోషిస్తారు. యిది బాబా మనకిచ్చిన అవకాశంగా భావిద్దాం...

**నీరుమతి:** అలాగేనండి..

**నీరుమతి:** ఏమండి.. బాబా యిలా చేస్తున్నారు... యిప్పటికి ఎన్నిసార్లు భజన పెట్టుకున్నాం. ప్రతీసారి అందరిని పిలవటం, వాళ్ళు రాకపోవటం, వాళ్ళు వస్తారని ఎక్కువ ప్రసాదం చేయటం, చివరకు ఎవరూ రావటం లేదు. మళ్ళీ వాళ్ళ యిళ్ళకు వెళ్ళి ప్రసాదాన్ని పంచిపెట్టటం. యిలా తీసుకెళ్ళి పెట్టడమే జరుగుతున్నది గాని ఒక్కరూ రావటం లేదు.

**గులాబ్‌దాస్:** బాధపడకు నీరుమతి.. బాబా కృప కూడా వాళ్లపై ఉండాలి. ఆయన అనుగ్రహం వుంటే ఎవరైనా రాగలుతారు. ఆ అవకాశం ఆయన వాళ్ళకివ్వాలి..

నీరుమతి: ఈసారి ఎవరిని పిలవద్దు.. బాబా ఫోటో దగ్గర మనయిద్దం కూర్చోని భజన చేసుకుందాం. ప్రసాదం కూడా మన యిద్దరికి కొద్దిగా రవ్వ, చక్కెర కలిపిన ప్రసాదం చేస్తాను. అదే బాబాకి నైవేద్యంగా బాబాకి పెడదాం.

**గులాబ్‌దాస్:** అలాగేలే నీరుమతి... నువ్వు చెప్పినట్టుగా ఈసారి ఎవరినీ పిలవద్దులే.. మనమే భజన చేసుకుందాం. నువ్వు చేసిన ఆ కొద్దిపాటి ప్రసాదమే నైవేద్యంగా పెట్టి తిందాం...

**నీరుమతి:** ఏవండి, బాబాకి మనపైన కరుణ వుందంటారా? నిజంగా మనం బాబాను ప్రేమిస్తున్నామా? చెప్పండి. బాబా ఎందుకు యిలా చేస్తున్నారు. భజనకు అందరూ వస్తారని ఎదురు చూడటం. ఎవరు రాక పోవటం.

**గులాబ్‌దాస్:** నీరుమతి... మనలో ఏదో లోపం ఉండి ఉంటుంది. అందుకే వస్తానన్నవారు కూడా రావటం లేదు. దానికి ఏదో కారణం ఉంటుందేమో అన్పిస్తుంది.

**నీరుమతి:** ఏవండి! మనమేదైనా తప్పు చేస్తున్నామా... బాబాను సరిగ్గా ప్రేమించటం లేదా.. ఆయన కొరకు తపించటంలేదా.. బాబా ఎందుకీ పరీక్ష పెడుతున్నాడు.. ఈ శేషజీవితంలో ఆయనపెట్టే పరీక్షలకు తట్టుకోగలమా..

**గులాబ్‌దాస్:** ఎందుకు నీరుమతి బాధపడతావు.. బాబాకి తెలియదా.. ప్రతి హృదయం ఆయనకు అవగతమే..

**నీరుమతి:** లేదండి. బాబాను మనం సరిగ్గా ప్రేమించటం లేదు. అందుకే ఎవరిని పిలిచినా రావటం లేదు. బాబా! చెప్పు నిన్ను సరిగ్గా ప్రేమించటం లేదా... మాలో ఏమైనా దోషముందా.. నీ నామాన్ని సరిగ్గా ఉచ్చరించడం లేదా. నీవు అనురాగ పిపాసివే. మాపై దయ చూపవా. నీ నామాన్ని వినే భాగ్యాన్ని అందరికీ కలిగించవా..

**గులాబ్‌దాస్:** నీరుమతి. ఎందుకు నీలో నీవు అలా మథన పడిపోతావు.. అలా ఆలోచిస్తూ నీరసపడి పోతున్నావు. దిగులు చెందకు.. అంతా బాబా చూసుకుంటాడు. రా భజన చేసుకుందాం. (యిద్దరూ కూర్చోని భజన చేస్తుండగా పిల్లనగ్రోవి వాయిద్యం విన్పిస్తుంది) ఒక పదేళ్ళ కుర్రవాడు ఆ భజనలోకి వచ్చి కూర్చుంటాడు. చక్కటి మెహెర్‌బాబా పాట పాడతాడు. ఆ మధురమయిన పాటవిని ఆ అపార్ట్‌మెంటులో వున్న వాళ్ళంతా ఆ భజనకు వచ్చి కూర్చుంటారు. పాట అయిన తర్వాత ఆ పిల్లవాడు.

పిల్లవాడు: అమ్మా నాకు కొంచెం ప్రసాదంపెట్టు తల్లీ. నాకు చాలా ఆకలిగా ఉందమ్మా... త్వరగా పెట్టమ్మా. ఆకలివేస్తుందమ్మా. ఆ బాబా ప్రసాదంపెట్టు తల్లి. సంకోచిస్తావేమ్మా. తినేసి వెళ్ళిపోతాను..

**నీరుమతి:** (గులాబ్‌దాస్) ఏవండి! ప్రసాదం సరిపోతుందా.

**గులాబ్‌దాస్:** నువ్వు యిద్దరికోసమే చేసావు. యిప్పుడు చూస్తే చాలామంది వచ్చారు

**నీరుమతి:** నాకు కంగారుగా వుందండి. ప్రసాదం చాలదండి.

**పిల్లవాడు:** అమ్మా నువ్వు చేసిన ప్రసాదం యిలా తేమ్మా. అందులోనే కొంచెం నాకు పెట్టమ్మా.

**గులాబ్‌దాస్:** నీరుమతి. దైవేచ్ఛ ఎలా వుందో. ఆ ప్రసాదం యిలా తీసుకురా.. ఈ బాబుకి, యిక్కడకు వచ్చిన వారందరికి పెడదాం.

**నీరుమతి:** అది మన యిద్దరి కోసమే చేసాను. అది ఎలా సరిపోతుందండీ.

**పిల్లవాడు:** అమ్మా! ప్రసాదం పెట్టు తల్లి.. ఆకలి వేస్తుంది.

**గులాబ్‌దాస్:** తీసుకురా నీరుమతి. అదే పెడదాం.
(చిన్న గిన్నెలో వున్న ప్రసాదం తీసుకు వస్తుంది నీరుమతి).

**పిల్లవాడు:** అమ్మా! ఆ గిన్నెలో వున్న ప్రసాదం నేను తీసుకుంటానమ్మా.

**నీరుమతి:** అలాగే నాయనా. యిదిగో ఈ ప్రసాదం నువ్వు చేయిపెట్టితీసుకో బాబు

**పిల్లవాడు:** (ఆ ప్రసాదం కొంచెం తీసుకొని నోటిలో వేసుకొని) కడుపు నిండి పోయిందమ్మా. ఎంత రుచిగా చేసావమ్మా. ఈ ప్రసాదాన్ని అందరికి పెట్టు తల్లి. యిక వస్తాను అంటూ వెళ్ళి పోతాడు.

**నీరుమతి:** ఆ అబ్బాయి ఎంత బాగా పాడాడండి. అయినా ఎప్పుడు రానిది యింత మంది వచ్చారేటండి. వీళ్లందరికి ఈ ప్రసాదం సరిపోతుందా.

**గులాబ్‌దాస్:** పెట్టు నీరుమతి. అదే సరిపెట్టు. (అక్కడున్న వాళ్ళందరికి ఆ ప్రసాదం పెడుతుంది).

**నీరుమతి:** ఏవండి అందరికి పెట్టినా యింకా యిందులో ప్రసాదం మిగిలేవుంది. గిన్నె నిండా ప్రసాదం అలాగే వుంది. యిది అక్షయ పాత్రలాగా నిండిపోతుంది. ఇది ఎంతో ఆశ్చర్యంగా వుంది..

**గులాబ్‌దాస్:** పిచ్చిదానా! యింకా గ్రహించ లేదా.. ఆ వచ్చిన బాలుడు ఎవరునుకుంటున్నావే. సాక్షాత్తు మెహెర్‌బాబాయే ఆ బాలుని రూపంలో వచ్చి మనల్ని కరుణించాడే. యింత మందికి ఆయన అనుగ్రహం లభించిందే. అందుకే ఆ ప్రసాదాన్ని ముందుగా తీసుకొని అక్షయ పాత్ర చేసాడు. నిజంగా బాబా కరుణామయుడు.

**నీరుమతి:** నిజంగా బాబా మన మొర విన్నాడండి.మన హృదయ ఘోష విన్నాడండి. ఆ బాలుని రూపంలో వచ్చి కరుణించాడు. యింత మంది హృదయాలను తన ప్రేమతో మేలుకొల్పాడు. నిజంగా బాబా కరుణామయుడేనండి. యిద్దరూ కలిసి అవతార్ మెహెర్‌బాబాకీ జై అంటారు.

**- తెరవేయబడును -**

**అవతారుని దివ్య సంభాషణా చాతుర్యం మెహెరాబాద్ సహవాస్ శీర్షికలో కనపడుతుంది. ఆసాంతం చదవండి! చదివించండి!!**

# పశ్చాత్తాప ప్రార్థన

**ఓం పరబ్రహ్మ - పరమాత్మా**
**యా - యాజ్‌దాన్**
**లా ఇలాహ్ ఇల్లిల్లాహ్**
**ఓ గాడ్ ఫాదర్ ఇన్ హెవెన్**
**ప**రమ దయానిధివగు ఓ ఈశ్వరా!
మా పాపములన్నిటికిని
మేము పశ్చాత్తాప పడుచున్నాము
అసత్యము, అధర్మము,
అపవిత్రమును అగు
మా ప్రతి తలంపునకును,
పశ్చాత్తాప పడుచున్నాము.
పలికి యుండరాని పలికిన
ప్రతి మాటకును,
చేసి యుండరాని చేసిన
ప్రతి చేతకును,
మేము పశ్చాత్తాప పడుచున్నాము.
స్వార్థముచే ప్రేరేపింపబడిన
ప్రతి పనికిని, ప్రతి మాటకును
ప్రతి తలంపునకు,
ద్వేషముచే ప్రేరేపింపబడిన
ప్రతి పనికిని,
ప్రతి మాటకును
ప్రతి తలంపునకును,
మేము పశ్చాత్తాప పడుచున్నాము.
ఇంకనూ ముఖ్యంగా,
కామముతో కూడిన
మా ప్రతి తలంపునకును
కామ ప్రేరితమగు
మా ప్రతి చేతకును
పలికిన ప్రతి అనృతమునకును,
సమస్త కపటవర్తనమునకును,
ఆడి తప్పిన
ప్రతి వాగ్దానమునకును,
సమస్త పరనిందలకు,
పరోక్ష నిందలకు,
మేము పశ్చాత్తాప పడుచున్నాము.
ఇంకనూ, ముఖ్యముగా కూడా,
పరులకు నాశన మొనగూర్చునట్టి
మేము చేసిన ప్రతి పనికిని,
ఇతరులకు బాధ కలుగజేసినట్లు
మేమాడిన ప్రతి మాటకును,
చేసిన ప్రతి చేతకును,
ఇతరులకు బాధ కలుగవలెనని
మేము కోరిన ప్రతి కోర్కెకును,
మిక్కిలి పశ్చాత్తాపపడుచున్నాము.
నీ యొక్క అపార దయతో ఓ ఈశ్వరా!
మేము చేసిన
ఈ పాపములన్నిటిని
క్షమింప వేడుకొనుచున్నాము.
తలపులలో కాని, మాటలలో కాని
చేతలలో కాని
నీ ఇచ్ఛానుసారము నడుచుకొన జాలక
నిరంతరము విఫలులమగుచున్న
మమ్ములనందరిని క్షమింప
వేడుకొనుచున్నాము.

# మండలి ప్రార్థన

ప్రియ దైవమా!

నిన్ను అధికాధికముగా ప్రేమించునట్లును, ఇంకను అధికముగా నీతో ఐక్యమగునంతటి అర్హతగల వారమగునంతవరకును నిన్నింకను అధికముగ ప్రేమించునటుల మాకందరకు సహాయము చేయుము. మరియు చిట్టచివరి వరకు బాబా కొంగును దృఢముగా పట్టుకొని ఉండుటకై మాకందరకు సహాయము చేయుము.

## జీవిత సభ్యత్వం

**2021 ఫిబ్రవరిలో పంపిన వారి వివరాలు**

| | | |
|---|---|---|
| 1. | శ్రీ బి.చక్రపాణి, కాకినాడ, తూ.గో.జి. | రు.1000/- |
| 2. | శ్రీమతి నాగమణి ఉప్పులూరి, కొవ్వూరు, ప.గో.జి. | రు.1000/- |
| 3. | డా॥ కె.నారాయణ రావు, తణుకు, ప.గో.జి. | రు.1000/- |
| 4. | శ్రీ తోట సత్తయ్య, లక్సెట్టిపేట, మంచిర్యాల జిల్లా | రు.1000/- |
| 5. | శ్రీ కె.పూర్ణచంద్రరావు, శ్రీనగర్, వర్ని, నిజామాబాద్ జిల్లా | రు.1000/- |
| | **మొత్తం** | **రు.5000/-** |

**మెహెర్‌బాబా పత్రిక జీవిత సభ్యత్వం రూ. 1000/-. ఆన్‌లైన్‌లో పంపగోరువారు**
శ్రీమతి శారద, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకు, సైనిక్‌పురి బ్రాంచి, సికింద్రాబాద్.
**SB A/C NO: 173201000029152, IFSC CODE: IOBA 0001732.**

**మెహెర్‌బాబా పత్రిక వార్షిక సభ్యత్వం రూ. 100/-. ఆన్‌లైన్‌లో పంపగోరువారు**
శ్రీమతి శారద, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకు, సైనిక్‌పురి బ్రాంచి, సికింద్రాబాద్.
**SB A/C NO: 173201000027973, IFSC CODE: IOBA 0001732.**
సభ్యత్వం పోస్టులో మనీ ఆర్డర్, బ్యాంకు చెక్కు, లేదా డిమాండ్ డ్రాఫ్ట్ ద్వారా పంపగోరువారు ఈ క్రింది పోస్టలు అడ్రస్సుకు పంపవల్సింది.

**మా అడ్రస్:**
**ఎడిటర్, మెహెర్‌బాబా, గోదావరి గార్డెన్స్, బాబాస్ హౌస్,** యాప్రాల్, ప్లాట్ నెం.32, జె.జె. నగర్ కాలనీ పోస్టు, సికింద్రాబాద్-500087. **ఫోన్: 99595-53218.**
**email: malladisukku@gmail.com**

Printed and published and owned by Dasika Nirmaladevi printed at Sai Srinivasa Printers, Khairatabad, Hyderabad, published at Koti Meher Centre, Esamia Bazar, Koti, behind Govt. Women's College, Hyderabad. **Editor: D. Nirmaladevi**

**RNI No. APTEL/2002/7310, Postal Concession: HSE/789/2020-2022 Dt.20-01-2020, Date of Publication 20h of every month, Posted at Patrika Channel on 25 / 26th every month.**